



మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

దేదీప్యంగా..



జిల్లా వ్యాప్తంగా కార్తీక దీపోత్సవాలు

భక్తులతో కిటకిటలాడిన ముక్కంటి ఆలయాలు

అనంతపురం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కార్తీక శోభ వచ్చింది. కార్తీకమాస తొలి సోమవారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలన్నీ కిటకిటలాడాయి. తెల్లవారుజామున, సాయంత్రం మహిళలు పెద్దఎత్తున ఆలయాలకు తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో రుద్రాభిషేకాలు, బిళ్వార్చనలు, గణపతిహోమాలు, రుద్రం, చమకం, నమకం పఠనాలతోపాలు మహా మృత్యుంజయ మంత్రార్చన నిర్వహించారు. నగరంలోని మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం భక్తులతో పోటెత్తింది. కాశీవిశ్వేశ్వర స్వామికి రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



మొంథా.. కుండపోత!

జిల్లాలో విస్తారంగా వర్షాలు.. నేడు, రేపు కూడా..

బీటీపీకి పోటెత్తిన వరద.. గేట్లు ఎత్తి నీరు విడుదల

సహాయక చర్యల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చిత్రావతి, వేదవతి వంటి నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. బీటీపీ, పీఏబీఆర్‌లకు వరద నీరు పోటెత్తుతోంది. భారీగా వాన నీరు చేరుతుండటంతో కుంటలు, చెరువుల వైపు ఎవరూ వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తుఫాన్ నేపథ్యంలో భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్(18463)ను మంగళవారం రద్దు చేశారు. అనంతపురం కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



ఉరవకొండలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రాంతం నుంచి బీటీపీ(భైరవానితిప్ప ప్రాజెక్టు)కి వరదనీటి ప్రవాహం పెరుగుతోంది. ఎగువ కర్ణాటక నుంచి వస్తున్న వరద నీటిని అంచనా వేసి దిగువ నదికి నీటిని విడుదల చేస్తున్నారు. ముఖ్యంగా సోమవారం రాత్రికి ఇన్‌ఫ్లో 3750 క్యూసెక్కుల ఉండగా అవుట్‌ఫ్లో 3504 క్యూసెక్కులు ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.72 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా ప్రాజెక్టు నుంచి వేదవతినదికి 3504 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండటంతో గుమ్మఘట్ట, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో తొమ్మిది చోట్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గుమ్మఘట్ట మండలంలోని కలుగోడు, గోనబావి - వేపలపర్తి, యర్రంపల్లి-గుడిపల్లి, భూపసముద్రం - కన్నెపల్లి, కణేకల్లు మండలంలోని రచ్చుమర్రి - శ్రీరంగాపురం, గంగులాపురం - కోకుర్తి, కణేకల్లు - మాల్యం, బ్రహ్మసముద్రం - బిదురకుంతం, బెణెకల్లు - హోన్నూరు, బొమ్మనహాళ్ మండలంలోని సిద్ధరాంపురం - బొల్లనగుడ్డం గ్రామాల మధ్యలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నదికి అటు ఇటు ఉన్న గ్రామాల రాకపోకలను పూర్తిగా నిషేధించి ఎక్కడికక్కడ పోలీసులు, రెవెన్యూ అధికారులు స్టాపర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి పూర్తిగా రాకపోకలు స్తంభింపజేశారు. వేదావతి, హగరి నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పరివాహక ప్రాంతాలలో సాగుచేసిన పంటలన్నీ నీట మునిగాయి. వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది.

అటువైపు వెళ్లొద్దు..

భైరవానితిప్ప ప్రాజెక్టు నుంచి నీటిని వదలడంతో మండలంలోని వేదవతి నది పరవళ్లు తొక్కుతోంది. బీటీపీకి పూర్తిస్థాయిలో వరద నీరు చేరడంతో శుక్రవారం రెండు గేట్లు ఎత్తి నీటిని వదిలారు. నీటి ప్రవాహంతో నది పరివాహకం (మిగతా 6లో...)



ఉరవకొండలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

బాబుతోనే దళితుల సంక్షేమం

ఎంపీ బీకే పార్థసారథి

బేగార్లపల్లిలో జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ

పలువురు దళిత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల హాజరు



బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు

మడకశిరటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దళితులు, బీసీల సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని ఎంపీ బీకేపార్థసారథి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని బేగార్లపల్లి గ్రామంలో బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నంది గామ నుంచి విప్ తంగిరాల సౌమ్య, రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజ, ఎమ్మెల్సీ గ్రీష్మ, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్, చింతలపూడి ఎమ్మెల్యే రోషన్, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, నందికొట్కూరు ఎమ్మెల్యే జి.జయసూర్య, సూళ్లూరు పేట ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ బీకేపార్థసారథి మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తొలిగిపోవడం విద్యతోనే సాధ్యమని భావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యావ్యవస్థను పటిష్టం చేస్తూ ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. చిత్తూరు ఎంపీ ప్రసాద్ మాట్లాడుతూ బాబూజగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని (మిగతా 6లో...)



ఎంపీ బీకే పార్థసారథి



ఎంపీ ప్రసాద్

చిట్టి చేతులకు గట్టి వెపన్స్...

ఆకట్టుకున్న పోలీసు ఆయుధాల ప్రదర్శన... ఆసక్తిగా తిలకించిన వందలాది మంది విద్యార్థులు



చిన్నారులకు వాకీటాకీ, ఇతర సెట్స్ గురించి వివరిస్తున్న ఎస్పీ



ఆయుధాల గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

అనంతపురం క్రైం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): పోలీసులు ఉపయోగించే అత్యాధునిక ఆయుధాలతోపాటు ఇతర నేర పరిశోధన పరికరాలు, బాంబ్ స్క్వాడ్, ఫూట్, థంబ్ ప్రింట్ ఐటెంటిటీ పరికరాలు, డాగ్ స్క్వాడ్ కళ్ల ముందు ప్రత్యక్షం కావడంతో చిన్నారులు ఆసక్తిగా తిలకించారు. అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు గెస్ట్‌హౌస్‌లోని షాదీఖానా హాల్‌లో సోమవారం ఆయుధాల ప్రదర్శన ఏర్పాటుచేశారు. అనుభవజ్ఞులైన సిబ్బంది వాటి గురించి వివరించారు. ఎస్పీ జగదీష్ ఓపెన్ హౌస్‌ను ప్రారంభించారు. జిల్లాకేంద్రంలోని పలు స్కూళ్ల నుంచీ వందలాది మంది విద్యార్థులు ప్రదర్శనను చూడ్డానికి క్యూ కట్టారు. ఆయుధాల గురించి అడిగి తెలుసుకోవడమే కాకుండా, వాటిని చేతుల్లోకి తీసుకుని మురిసిపోయారు. మరికొందరు విద్యార్థులు ఆయుధాల వివరాలు నోట్ చేసుకుంటూ కనిపించారు. పోలీసు జాగిలాలతో షేక్ హ్యాండ్ తీసుకుంటూ ఆనందపడ్డారు.

మొక్కజొన్న కొనుగోలుకు సహకరించండి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికి ఎమ్మెల్యే కాలవ లేఖ



లేఖ రాస్తున్న కాలవ

ఆంధ్రజ్యోతికి స్పందన

బొమ్మనహాళ్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) రాయదుర్గం నియోజకవర్గంలో రైతులు పండించిన మొక్కజొన్న ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సోమవారం విజ్ఞప్తి చేశారు. మొక్కజొన్న రైతుల కష్టాలపై 'ఎవరికి మొక్కాలి' శీర్షికను 'ఆంధ్రజ్యోతి' సోమవారం ప్రచురించిన కథనంపై ఎమ్మెల్యే స్పందిచారు. రైతులను ఆదుకోవాలని మంత్రికి సోమవారం లేఖ రాశారు. ఖరీఫ్‌లో రైతులు వ్యయప్రయాసలకోర్చి అత్యంత వెనుకబడ్డ నియోజకవర్గంలోని డీ హిరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల రైతులు 12,115 హెక్టర్లలో మొక్కజొన్న సాగు చేశారని తెలియజేశారు. పంట దిగుబడి సంతృప్తికరంగా వచ్చినా గిట్టుబాటు ధర దక్కక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,400 ఉండగా.. దళారులు, రూ.1700కే కొనుగోలు చేస్తూ మోసం చేస్తున్నారన్నారు. వర్షాలతో రైతులు పంటను ఆరబెట్టడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కాలవ విజ్ఞప్తి చేశారు.

రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే దగ్గుపాటి



మోటార్లను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలో రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు చే శామని అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరంలో రూ.77లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, మోటారు పంపులను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి ప్రారంభించారు. బుడ్డప్పనగర్, శ్రీనగర్ కాలనీ వాటర్ ట్యాంకుల్లో రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన స్టార్ డెల్టా స్టార్టర్‌బాక్స్, 20 హెచ్‌పీ బూస్టర్‌మోనోబ్లాక్ అత్యాధునిక మోటార్లను ప్రారంభించారు. ఆజాద్‌నగర్, ఒకటో రోడ్డులో రూ.77లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే నగరంలో రూ.30కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నగరంలో చివరి కాలనీ వరకు ప్రతి నిత్యం తాగునీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తమకు అనువుగా సమావేశాలకు భవనం కావాలని కోరగా... ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ స్పందిస్తూ కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు గాలికి..!

- ఎరువుల డీలర్ల ఇష్టారాజ్యం
- రసీదులు ఇవ్వకుండా రైతులకు కుచ్చుటోపీ
- ఎమ్మార్పీపై అదనంగా వసూలు
- వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం

6

సత్యసాయి శతజయంతి

ఉత్సవాలకు రండి

- సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

ఊట నీటితో తిప్పలు పడుతున్నాం..

పెద్దయక్కలూరు గ్రామస్థుల ఆవేదన

కలెక్టరేట్‌లో నిరసన

పరిష్కార వేదికలో 565 వినతులు

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఊటనీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పెద్దపప్పూరు మండలం చాగల్లు డ్యాం పరిధిలోని పెద్దయక్కలూరు ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం వీర నాగరాజు, బండి పుల్లయ్య తదితరులు కలెక్టరేట్‌లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చాగల్లు డ్యాం ద్వారా గ్రామంలోకి ఊటనీరు వస్తోందన్నారు. దీంతో నీరు గ్రామంలో మోకాళ్లపైగా నీరు చేరుకుందని తెలిపారు. కనీసం కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా ఇబ్బందిగా ఉందని వాపోయారు. ఊటనీటితో పొలాలు కూడా పండించుకోలేని దుస్థితిలో ఉన్నామన్నారు. హెచ్చెల్సీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పునరావాసం కల్పించాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ వారి వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు.



బైఠాయించిన పెద్దయక్కలూరు గ్రామస్థులు

రెండేళ్లుగా తిరుగుతున్నా..

తన భూమి సరిహద్దులు చూపమని రెండేళ్లుగా తిరుగుతున్నానని గార్లదిన్నె మండలం జంబులదిన్నె గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పొలంలోని సర్వే నెంబరు 37లో 5.30ఎకరాలు ఉందని తెలిపాడు. ఇందులో అన్నదమ్ములు సాగు చేసుకుంటున్నామని వివరించాడు. తమ భూమిని తమకు తెలియకుండానే జాయింట్ ఎల్‌పీఎం కింద నమోదు చేశారని తెలిపాడు. రెండేళ్లుగా భూముల హద్దులు చేయాలని కోరుతుంటే అధికారులు పట్టించుకోలేదని వాపోయాడు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. వాటికి నాణ్యమైన పరిష్కార మార్గం చూపాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన 565 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. జేసీ శివ్‌నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల అర్జీలు స్వీకరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు రండి

● సీఎం చంద్రబాబుకు ఆహ్వానం


ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానిస్తున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులు ఆహ్వానించారు. ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్.. సభ్యుడు ఐఎన్ఎస్ ప్రసాద్‌తో కలిసి సోమవారం అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. నవంబరులో నిర్వహించే సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు.. మానవాళికి సత్యసాయి బాబా అందించిన సేవలు అపారమైనవనీ, విద్య, వైద్యం, తాగునీరు రంగాల్లో చేసిన విశిష్ట సేవలను గుర్తు చేసుకున్నట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. పుట్టపర్తిలో చేపట్టబోయే సత్యసాయి శత జయంతి ఉత్సవాల ఏర్పాట్లపై సీఎం ఆరా తీసినట్లు చెప్పారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు ఏపీ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారన్నారు. సత్యసాయి జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ పండుగగా నిర్వహిస్తూ నిర్ణయం తీసుకోవడంపై ట్రస్టు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ట్రస్టు సభ్యులు కలిసి.. శత జయంతి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడు చలం, సత్యసాయి సేవాదళ్ ఏపీ అధ్యక్షుడు లక్ష్మణరావు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.29

అనంతపురంరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.29తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1650 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

నిబంధనలు గాలికి..!

- ఎరువుల డీలర్ల ఇష్టారాజ్యం
- రసీదులు ఇవ్వకుండా రైతులకు కుచ్చుటోపీ
- ఎమ్మార్పీపై అదనంగా వసూలు
- వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం


అనంతపురంలోని దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి (ఫైల్)

అనంతపురం అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాల డీలర్లు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ జేబులు నింపుకుంటున్నారు. నిబంధనల మేరకు దుకాణాల్లో తప్పనిసరిగా ధరల పట్టిక, స్టాక్ వివరాలు ప్రదర్శించాలి. ఉమ్మడి జిల్లాలోని ఎక్కువ శాతం దుకాణాల్లో ఈ నిబంధనలు అమలు కావడం లేదు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులకు సంబంధించి రసీదులు తప్పని సరిగా ఇవ్వాలి. కొందరు డీలర్లు రసీదులు ఇవ్వకుండా రైతులకు కుచ్చుటోపీ పెడుతున్నారు. రసీదులు లేకపోవడంతో నాణ్యతలేని విత్తనాలు, పురుగు మందుల ద్వారా పంట సరిగా పండకపోవడం.. పంట నష్టం జరిగిన సమయాల్లో రైతులకు నష్టపరిహారం కోసం ఫిర్యాదు చేసేందుకు అవకాశమే లేకుండా పోతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

రైతు ఫిర్యాదుతో బట్టబయలు

ఉమ్మడి జిల్లాలో పలువురు డీలర్లు రైతులకు రసీదులు ఇవ్వడం లేదు. తాజాగా అనంతపురం నగరం ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులోని శ్రీ సాయిగణేష్ ఆగ్రో ఏజెన్సీ డీలర్‌పై ఓ రైతు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో నిబంధనల అతిక్రమణలు బట్టబయలయ్యాయి. కూడేరు మండలం కమ్మూరుకు చెందిన రైతు లక్ష్మీనారాయణ.. సాయిగణేష్ ఆగ్రో ఏజెన్సీలో దానిమ్మ పంట కోసం అగ్రోమిన్ మ్యాక్స్ 4 కిలోలు, 19-19-19 ఎరువులు 3 కిలోలు కొనుగోలు చేశాడు. అందుకు సంబంధించి రూ.2400 ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఎరువుల కొనుగోలుకు సంబంధించిన బిల్లు ఇవ్వకుండా డీలర్ దురుసుగా ప్రవర్తించాడని, తనకు విక్రయించిన ఎరువుల నాణ్యతను పరీక్షించాలని కలెక్టర్ ఆనంద్‌కు బాధిత రైతు ఇటీవల ఫిర్యాదు చేశాడు. దీన్ని కలెక్టర్ సీరియస్‌గా పరిగణించారు. ఆయన ఆదేశాలతో వ్యవసాయ అధికారులు తనిఖీలు చేశారు. రైతుకు విక్రయించిన ఎరువుల రకాలను సీజ్ చేసి, పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఈ మేరకు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ ఎరువుల కొనుగోలు చేసిన రైతుకు బిల్లు ఎందుకు ఇవ్వలేదన్న అంశంపై సాయిగణేష్ ఆగ్రో ఏజెన్సీ డీలర్‌కు షోకాజు నోటీసు జారీ చేశారు. రైతుకు బిల్లు ఇవ్వని మాట వాస్తవమేనని, భవిష్యత్‌లో ఇలాంటి పొరపాటు చేయకుండా జాగ్రత్త వహిస్తానని సదరు డీలర్ వివరణ ఇచ్చినట్లు సమాచారం.

నాణ్యతలేని విత్తనాలతో నష్టాలు

ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏటా నాణ్యతలేని విత్తనాలతో పెద్ద సంఖ్యలో రైతులు నష్టపోతున్నారు. నాసిరకం విత్తనాలతో పంట మొలక సరిగా లేకపోవడం.. మధ్యలోనే ఎండిపోవడం.. దిగుబడి సరిగా లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో సదరు డీలర్‌ను సంప్రదించి, వాస్తవ పరిస్థితులను ఆధారాలతో వివరించినా.. విత్తనం సమస్య లేదని, భూమిలోనే ఏదో తేడా ఉందని... ఎలాంటి పురుగు మందులు కొట్టావో నంటూ బుకాయిస్తున్నారు. కొందరు డీలర్లు రసీదులు ఇవ్వకపోవడంపై వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. విత్తనాల కొనుగోలుకు సంబంధించిన రసీదుతోపాటు తగిన ఆధారాలు చూపించిన రైతుల్లో కొందరికి ఆయా కంపెనీలు నష్టపరిహారాన్ని అందిస్తున్నాయి. ఆధారాలు అన్ని ఉన్నా... మరికొందరికి పరిహారం ఇవ్వకుండా చేతులెత్తేసిన సంఘటనలు ఉన్నాయి. చీనీ, పత్తి పంట సాగు చేసే ప్రాంతాల్లో నిషేధిత గ్లైసెల్ గడ్డి మందును కొందరు డీలర్లు విక్రయిస్తున్నారు. దీనిపై వ్యవసాయశాఖ యంత్రాంగం పట్టించుకోలేదు.

ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు

యూరియా బస్తా ఎమ్మార్పీ రూ.267 ఉంది. కొందరు డీలర్లు ఒక్కో బస్తా రూ.400 నుంచి రూ.450 దాకా విక్రయిస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, కదిరి తదితర ప్రాంతాల్లో యూరియాపై అదనంగా వసూలు చేస్తున్నారు. రబీ సీజన్‌లో పంటల సాగులో డీఏపీ ఎక్కువగా వాడుతున్నారు. డీఏపీ బస్తా ఎమ్మార్పీ రూ.1350 ఉంది. డీఏపీ బస్తాకు రూ.1500 నుంచి రూ.1600 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. తాడిపత్రి నియోజకవర్గం, ఇతర మండలాల్లో డీఏపీపై అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. వీటిని నియంత్రించడంలో వ్యవసాయశాఖ విఫలమవుతోంది.

అవగాహన కల్పించడంలో అలసత్వం

డీలర్లు నిబంధనలు అతిక్రయిస్తే రైతులు ఏం చేయాలన్న అంశాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ యంత్రాంగం అలసత్వం వహిస్తోంది. నిబంధనల మేరకు ఎరువులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు డీలర్ తప్పనిసరిగా బిల్లును (ఫారం-ఎం రూపంలో) ఇవ్వాలి. రసీదులో బ్యాచ్ నెంబర్ నమోదు చేయాలి. రసీదు ఇవ్వకపోతే లైసెన్స్ రద్దు చేయడం, ఇతర చర్యలు తీసుకోవాలి. అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ లైసెన్స్‌ను రద్దు చేయడంతో పాటు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయాలి. బస్తాల తూకం తక్కువ ఉంటే రూ.2వేలు జరిమానా విధించాలి. ఎరువుల నాణ్యత తక్కువగా ఉంటే కేసు నమోదు చేయాలి. ధరల పట్టికలో ధరలు, స్టాక్ వివరాలు నమోదు చేయకుంటే డీలర్‌పై చర్యలు తీసుకోవాలి. నిషేధిత క్రిమిసంహారక మందులు, గడ్డి మందులు విక్రయిస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. విత్తనాల నాణ్యతా లోపంతో పంట సరిగా మొలకెత్తకపోతే వ్యవసాయ అధికారికి రైతులు ఫిర్యాదు చేయొచ్చు. జిల్లా వ్యవసాయ అధికారి ఆ ఫిర్యాదుపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల బృందాన్ని నియమించి, పంటపరిశీలనకు పంపాలి. వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించి రైతులు నష్టపరిహారం పొందే అవకాశం ఉంది. ఈ విషయాలను క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ అధికారులు శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలున్నాయి.

అనుమతులు లేని డిస్ట్రిబ్యూటర్ల నుంచి కొనుగోలు..

విత్తనాలు, పురుగు మందులకు సంబంధించిన కంపెనీలు రాష్ట్రంలో డిస్ట్రిబ్యూటర్లను నియమిస్తాయి. ఆయా డిస్ట్రిబ్యూటర్లకు రాష్ట్ర వ్యవసాయ శాఖ అనుమతులు మంజూరు చేస్తుంది. అనుమతులు కలిగిన డిస్ట్రిబ్యూటర్ల నుంచే డీలర్లు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలి. అందుకు విరుద్ధంగా ఉమ్మడి జిల్లాలోని కొందరు డీలర్లు అనుమతులు లేని డిస్ట్రిబ్యూటర్ల నుంచి విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేస్తున్నారు. వాటని రైతులకు అంటగడుతున్నారు. జిల్లా స్థాయి వ్యవసాయ ఉన్నతాధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో డీలర్లు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది.

నిబంధనలు అమలు చేయాల్సిందే

ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో తప్పని సరిగా ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాల్సిందే. కొనుగోళ్లపై రైతులకు రసీదు ఇవ్వాలి. రసీదు ఇవ్వలేదని రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులను ఎమ్మార్పీకే విక్రయించాలి. ప్రతి దుకాణంలో ధరల పట్టిక, స్టాక్ వివరాలు నమోదు చేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

-ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

మారుతున్న గ్రామీణ రోడ్ల రూపురేఖలు: పరిటాల సునీత


పూర్తయిన రోడ్డును చూపుతున్న పరిటాల సునీత, మహిళలు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరాక నియోజకవర్గంలో గ్రామీణ రోడ్ల రూపురేఖలు మారాయని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని న్యామద్దల నుంచి చిన్నప్పేట మీదుగా హరియాన్ చెరువు వరకు రూ.2.94కోట్లతో చేపట్టిన తారురోడ్డు పనులను సోమవారం ఆమె పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉండేవన్నారు. తమ ప్రభుత్వంలో ఎన్నడూలేని విధంగా రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై ఈనెల 28, 29 తేదీల్లో అన్ని మండలాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేసినట్లు జడ్పీ సీఈఓ శివశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ మేరకు ఇప్పటికే శిక్షణకు సంబంధించి ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

రేపు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని ఈ నెల 29న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ శివశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు అనుగుణంగా అజెండా అంశాలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. అజెండాకు అనుగుణంగా పలు అంశాలపై చర్చ జరిపి తీర్మానాలకు అమోదం తెలుపుతామని అన్నారు. సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరారు

బాబుతోనే దళితుల సంక్షేమం

(5వ పేజీ తరువాయి)



అన్నారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగాన్ని పవిత్రగ్రంథంగా పూజిస్తారని, రాజ్యాంగం వల్లే అందరి తలరాతలు మారాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్‌ల ఆశీస్సుల వల్ల ఎంతో మంది దళితులు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎదగగలిగారన్నారు. రాజ్యాంగం స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దళితుల సంక్షేమానికి వెనకబడిన వర్గాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. వైసీపీ పాలనలో రాజ్యాంగాన్ని పూర్తిగా తుంగలో తొక్కారని, చట్టాలను సైతం చేతిలోకి తీసుకొని దళితులను, వెనకబడిన వర్గాలను అనేక రకాలుగా అణగదొక్కారని అన్నారు.

పారిశ్రామిక రంగం పరుగులు : గుండుమల తిప్పేస్వామి

ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవ వల్ల పారిశ్రామికంగా రాష్ట్రం పరుగులు తీస్తోంది. యువతకు ఉపాధి చూపేందుకు వారిద్దరు అహర్నిశలు శ్రమిస్తున్నారు. విశాఖపట్నంలో రూ.15లక్షల కోట్ల పెట్టుబడులతో 15 లక్షల నుంచి 20 లక్షల మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమలు నెలకొల్పుతుండటంతో దేశం మొత్తం రాష్ట్రం వైపు చూస్తోంది. బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్‌ల ఆశయ సాధనకు కృషి చేస్తూ, వారి అడుగు జాడల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నడుస్తున్నారు.



డ్రామా మాస్టర్‌ను నమ్మొద్దు: గ్రీష్మ, ఎమ్మెల్సీ

ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం చిన్నాభిన్నం అయింది. నా ఎస్సీలు, నా బీసీలు అంటూ జగన్ మరోసారి ప్రజల్లోకి వస్తారు. ఆ డ్రామా మాస్టర్‌ను నమ్మితే మరో మారు రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతుంది. 2019 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అప్పటి అధికార పక్షం చేసే దౌర్జన్యాలను అడ్డుకొనేందుకు అనేక పోరాటాలు చేశాం.

చారిత్రాత్మక ఘట్టం : సౌమ్య, ఎమ్మెల్యే

బాబూజగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు దళిత ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరవ్వడం చారిత్రాత్మక ఘట్టం. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఇలాంటి కార్యక్రమం జరిగి ఉండదు. దళిత జాతికి జగన్ అన్యాయం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రికాగానే బీసీలు, ఎస్సీలకు అండగా నిలిచారు.

రాజ్యాంగం.. రక్షణ కవచం : కుమారరాజా, ఎమ్మెల్యే

వెనకబడిన వర్గాలకు రాజ్యాంగం ఒక రక్షణ కవచం. అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తితోనే తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం ఆర్థికంగా దెబ్బతింది. గూగుల్ సెంటర్‌కు, గోలీల సెంటర్‌కు తేడా తెలియని వ్యక్తి జగన్. రాష్ట్ర భవిషత్తును దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం నగరానికి గూగుల్ డేటా సెంటర్‌ను తెచ్చారు.

ఎమ్మెల్యేలు విజయచంద్ర, మురళీమోహన్, దస్తగిరి, జయసూర్య, విజయశ్రీ, విప్ శ్రీధర్ తదితరులు మాట్లాడుతూ బాబూజగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ ఆశయ సాధన కోసం సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొంథా.. కుండపోత..


జీటీపీ నాలుగు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు


వేపలపర్తి మార్గాన్ని మూసేసిన అధికారులు

(5వ పేజీ తరువాయి)

జలకళ సంతరించుకుంది. హైవేపై నిర్మించిన బ్రిడ్జిని ఆనుకుని నీరు ప్రవహిస్తుండటంతో గ్రామీణులు తిలకిస్తున్నారు. మండలంలో నరసాపురం, బ్రాహ్మణపల్లి, రమణేపల్లి, గుండ్లపల్లి, శ్రీరంగాపురం, బూదివర్తి గ్రామాల సమీపంలో ఈ నది ప్రవహిస్తుంది. తహసీల్దార్ అనిల్‌కుమార్, వీఆర్వోలు రమేష్‌లు నదిలోకి వెళ్లకూడదంటూ రెండు రోజులు ఈ గ్రామాల్లో దండోరా వేయించారు. గుండ్లపల్లి బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను నిలిపివేసి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

మళ్లీ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

పీఏబీఆర్(పెన్నేహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)లో జలవిద్యుత్ ఉత్పత్తి తిరిగి ప్రారంభించారు. 695 క్యూసెక్కుల నీటితో జల విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా, రెండు గేట్ల ద్వారా 1115 క్యూసెక్కుల నీటిని మిడ్ పెన్నార్ డ్యాంకు వదులుతున్నట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటరమణ సోమవారం తెలిపారు. హంద్రీ-నీవా నుంచి 1000 క్యూసెక్కులు, లింక్ చానల్ నుండి 180 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండటంతో డ్యాంలో నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం డ్యాంలో 5.386 టిఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. హంద్రీనీవా నీటితో పాటు తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల నీరు అధికంగా చేరుతుండటంతో డ్యాంగేట్లు మరిన్ని ఎత్తి నీటిని విడుదల చేస్తామని డీఈఈ వెంకటరమణ, తెలిపారు. డ్యాంలోని నీటిమట్టం, తదితరు అంశాలను ఏఈఈలు లక్ష్మీదేవి, ముత్యాలప్ప, గంగమ్మ, రేణుకు పర్య వేక్షిస్తున్నారన్నారు. కాగా డ్యాంలో రెండుగేట్ల నుంచి నీరు విడుదల చేయడంతో ప్రవాహం ఎక్కువగా ఉందని, నీటిని చూడటానికి గేట్ల వైపు ఎవరు వెళ్లవద్దని డీఈఈ వెంకటరమణ సూచించారు.

సహాయక చర్యలు చేపట్టాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో కురిసే వర్షాల వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ఆయన జిల్లా అధికారులతో తుపాను సన్నద్ధతపై సమీక్షించి, దిశా నిర్దేశం చేశారు. ఎప్పటికప్పుడు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, వాతావరణ శాఖ వారి హెచ్చరికలు, సూచనల మేరకు ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాపై తుపాను తీవ్ర ప్రభావం లేనప్పటికీ, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబరు 8500292992కు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పలు శాఖల అధికారులు, సిబ్బంది జిల్లా పంచాయతీ శాఖ, ఏపీఎస్పీడీసీఎల్ తదితర శాఖలు సహాయక చర్యలకు హాజరయ్యేందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు సమావేశంలో జేసీ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు భారీ వర్షసూచన

మొంథా తుపాను ప్రభావంతో సోమవారం ఉమ్మడి జిల్లాలో మోస్తరు నుంచి పలు చోట్ల భారీ వర్షం కురిసింది. మంగళ, బుధవారాల్లో భారీ వర్షం పడే అవకాశం ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త నారాయణస్వామి తెలిపారు. పలుచోట్ల ఈదురుగాలులుతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం సాయంత్రం ఉరవకొండలో అత్యధికంగా 52 మి.మీ, బెళుగుప్ప మండలంలో 38.5, రాయదుర్గంలో 30.75 బ్రహ్మసముద్రం 20.5, శెట్టూరు 17, బొమ్మనహాళ్ 16.5, గుంతకల్లు 13.75 మి.మీ, గుమ్మఘట్ట 11.25 మి.మీ, నార్పల 8 మి.మీ, డి.హీరేహాళ్ 6.5 వర్షం కురిసింది. వీటితో పాటు పలు మండలాల్లో వర్షం కురిసింది.


గుండ్లపల్లి వద్ద పరవళ్లు తొక్కుతున్న వేదవతి నది


పీఏబీఆర్ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

రైల్వే గేటును ఢీకొట్టిన మినీ బస్సు

ఆపకుండా వెళ్లిపోయిన డ్రైవర్


గేటు విరిగిపోవడంతో ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన మరో గేటు

ముదిగుబ్బ, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరిధి పుట్టపర్తి రోడ్డులోని రైల్వే గేటును మినీ బస్సు ఢీకొట్టి, ఆపకుండా వెళ్లిపోయింది. దీంతో గేటు విరిగినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధ్యాహ్నం నర్సాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు వస్తున్న సమయంలో గేటు వేస్తుండగా ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి వెళ్లే మినీ బస్సు వచ్చింది. గేటును బలంగా ఢీకొట్టి, డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. అప్రమత్తమైన సిబ్బంది రైలు వచ్చే సమయంలో ప్రత్యామ్నాయ గేట్లను ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ను నియంత్రించడంతో ప్రమాదం తప్పింది. సంబంధిత రైల్వే అధికారులు గేటుకు మరమ్మతులు చేపట్టారు. ఈ విషయంపై స్టేషన్ మాస్టర్ శివశంకర్‌ను అడగ్గా.. గేటుకు మరమతులు చేస్తుండగా.. వెల్డింగ్ కట్ అయి గేటు విరిగిపోయిందని చెప్పడం గమనార్హం.

మెగా సప్లిమెంటరీ అవకాశం

అనంతపురంరూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో 2005 నుంచి 2016 మధ్య చదివి, ఫెయిలైన విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సరిత సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి నవంబరు 29వ తేదీ వరకు కళాశాలలో ఫీజు చెల్లించవచ్చన్నారు. వివరాలకు 9676414799 నంబరులో సంప్రదించవచ్చన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉద్యమ దీప్తి.. వీఎన్ రెడ్డి

స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం

ఎన్నోమార్లు జైలుకు సైతం..

దివికేగిన స్వాతంత్ర్య సమరయోధుడు వీఎన్ రెడ్డి


వీఎన్ రెడ్డి (ఫైల్)

పావగడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వీఎన్‌రెడ్డి దేశ స్వాతంత్ర్యం కోసం విద్యార్థి దశ నుంచే అవిశ్రాంతంగా పోరాడారు. పావగడ, తుమకూరు జిల్లాలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్నారు. తెల్లవాళ్లను తరిమికొట్టే ప్రయత్నాల్లో భాగంగా ఎన్నోసార్లు జైలుకు సైతం వెళ్లారు. ఎలుకతోకకు నిప్పంటించి పావగడ తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్లను దహనం చేసేందుకు యత్నించిన కేసులో ఆయన జైలుకు వెళ్లడం ఒక ఉదాహరణ. వందేళ్లకుపైబడి జీవించిన ఆయన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు కల్లూరి సుబ్బారావు, తరిమెల నాగిరెడ్డి, విద్వాన్‌విశ్వం, ఎంఎం లింగణ్ణ, పప్పూరి రామాచారితో కలిసి ఎన్నో ఉద్యమాల్లో తెల్లవారికి వ్యతిరేకంగా పోరాడారు. ఎంతో నిరాడంబర జీవితం గడిపిన వీఎన్‌రెడ్డి సోమవారం ఆయన స్వగ్రామం వెంకటాపురంలో మృతి చెందారు.

చివరి స్వాతంత్ర్య యోధుడు

జలియన్‌వాలాబాగ్ దురంతానికి నిరసనగా కర్ణాటకలోని విదురాశ్వత్థంలో జరిగిన నిరసన కార్యక్రమంలో వీఎన్‌రెడ్డి పాల్గొన్నారు. నిరసనకారులపై బ్రిటిష్ వారు జరిపిన కాల్పుల్లో వీఎన్‌రెడ్డి త్రుటిలో తప్పించుకున్నారు. తర్వాత కూడా నిర్భయంగా స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా సామాజిక స్పృహతో అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇంగ్లిష్ అనర్గళంగా మాట్లాడే ఆయన కర్ణాటక రాష్ట్రంలో చిట్టచివరి పెన్షన్ అందుకున్న స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తింపు పొందారు.

జడ్పీటీసీగా సేవలు

1923లో మార్చి 4న వెంకటాపురం గ్రామంలో ఎరుపరెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు జన్మించిన వి.నర్సింహారెడ్డి ఎస్ఎస్ఎల్‌సి వరకు చదువుకున్నారు. స్వాతంత్ర్యానంతరం జడ్పీటీసీగా పని చేసిన ఆయన గ్రామాల రోడ్లకు ఇరువైపులా చింతచెట్లు నాటించారు. తద్వారా పంచాయతీ ఆదాయం పెరగడానికి తోడ్పడ్డారు. చదువుకుంటున్న సమయంలోనే పాఠశాల ప్రార్థన సమయంలో 'అవర్ నోబెల్‌కింగ్ ఎడ్వర్డ్ లాంగ్ లీవ్' అంటూ బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా నినదించారు. వీఎన్‌రెడ్డికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఆయన స్వగ్రామంలో ప్రభుత్వ లాంఛనాలతో మంగళవారం అంత్యక్రియలు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. కాగా గ్రేడ్ టూ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ రాజగోపాల్, అధికార బృందం సోమవారం వెంకటాపురానికి వెళ్లి వీఎన్‌రెడ్డి భౌతికకాయానికి ఘనంగా నివాళులు అర్పించింది.

మందు.. విందు !

- మందుబాబుల అడ్డాగా కొడిమి జగనన్న లేఅవుట్ !
- పగలు, రాత్రి తేడాలేదు.. గుంపులుగా మద్యపానం
- కొరవడిన హౌసింగ్ అధికారుల పర్యవేక్షణ

అనంతపురంరూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి సమీపంలోని కొడిమి జగనన్న లేఅవుట్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పగలు, రాత్రి తేడా లేకుండా మందుబాబు లేఅవుట్లలో సిట్టింగ్ వేస్తూ, విందులు చేసుకుంటున్నారు. దీంతో లేఅవుట్‌లో ఎక్కడ చూసినా బీరు సీసాలు, మద్యం బాటిళ్లే కనిపిస్తున్నాయి. హౌసింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మందుబాబుల విందులకు అడ్డు అదుపు లేకుండా పోయింది.

80 ఎకరాల్లో..

కొడిమి ప్రాంతం జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో ఉండటంతో అప్పటి ప్రజాప్రతినిధులు ఎకరాకు దాదాపు రూ.20లక్షలకుపైగా పోసి ఇక్కడ భూమి కొనుగోలు చేశారు. ఇలా ప్రభుత్వం తరఫున 80ఎకరాలకుపైగానే కొనుగోలు చేసి లేఅవుట్ వేశారు. అనంతపురం అర్బన్, నారాయణపురం, కొడిమి తదితర ప్రాంతాల వరకు స్థానికంగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. 3500మంది లబ్ధిదారులకు స్థలాలు ఇచ్చి నిర్మాణాలు చేపట్టారు. కొన్ని గోడల వరకు కట్టారు. మరికొన్ని పునాదులకే పరిమితం అయ్యాయి. రాష్ట్రంలో అధికారం మారడంతో ప్రస్తుత ప్రభుత్వం జగనన్న లేఅవుట్లను తాత్కాలికంగా వదిలేసింది. ఇదే అదనుగా మందుబాబులు గోడల వరకు పూర్తయిన ఇళ్లతో పాటు లేఅవుట్‌ను తమ స్థావరంగా మార్చుకున్నారు. పగలు, రాత్రి అన్న తేడాలు లేకుండా మందుబాబులు గుంపులు, గుంపులుగా వెళ్లి మద్యం సేవిస్తున్నట్లు సమాచారం. రాత్రి వేళల్లో మందుబాబుల తాకిడి మరింత ఎక్కువగా ఉన్నట్లు చుట్టుపక్కల గ్రామస్థులు చెబుతున్నారు. జగనన్న లేఅవుట్‌లు పేద లబ్ధిదారులకు ఏమోగాని మందుబాబులుగా బాగా ఉపయోగపడుతున్నాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.


లేఅవుట్‌లో ఉంచిన ఇనుప కడ్డీలు

పట్టించుకోని అధికారులు

కొడిమి జగనన్న లేఅవుట్ మందుబాబులకు కేంద్రంగా మారడానికి హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏడాది కాలంలో అధికారులు ఆ వైపు తొంగిచూసిన పాపాన పోలేదంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థమవుతోంది. పత్రికల్లో వార్తలు వచ్చిన సందర్భాల్లో తప్పితే మరో మారు అక్కడకు వెళ్లింది లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇటీవల కాలంలో కొడిమి లేఅవుట్‌లో ఇనుప సామగ్రి, ఇసుక, ఇటుకలు చోరీ అయిన విషయం తెలిసిందే. అయినప్పటికి సంబంధిత అధికారులు మాత్రం ఆ వైపు తొంగిచూడని పరిస్థితి ఉంది. వాటి గురించి ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోకపోవడంతో అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. దీంతో మందుబాబులు తమ స్థావరంగా మార్చుకున్నారు.

మా దృష్టికి వచ్చాయి

జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు మా దృష్టికి వచ్చాయి. లేఅవుట్లను హౌసింగ్ ఏఈలు, ఇతర సిబ్బంది తరచూ పరిశీలిస్తున్నారు. ఆలమూరు వంటి లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. అందులో లబ్ధిదారులు చేరుకుంటే సమస్య తీరుతుంది. లేఅవుట్లలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

-శ్రీమన్నారాయణ, డీఈ, హౌసింగ్


లేవుట్‌లో పడేసిన మద్యం బాటిళ్లు

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ఆరుగురి ఆత్మహత్య

బొమ్మనహాళ్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో సోమవారం ఆరుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. బొమ్మనహాళ్‌లో శుభశ్రీ ప్రధాన్(28) అనే మహిళ సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ నబీరసూల్ తెలిపిన మేరకు.. ఒడిషా రాష్ట్రంలోని ఉదయపూర్ జిల్లా హరిపూర్ మండలం నౌగర్ గ్రామానికి చెందిన శుభశ్రీ ప్రధాన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త దిబ్యాజ్యోతిరాయ్ బొమ్మనహాళ్ వద్ద ఉన్న జిందాల్ ఫ్యాక్టరీలో పైప్ ఫెన్సింగ్ లైన్‌మ్యాన్‌గా పని చేస్తున్నాడు. వారి ఇంట్లో దిబ్యాజ్యోతి రాయ్ బంధువుల అబ్బాయి ఉంటున్నాడు. భర్త బంధువు ఇంట్లో ఉండడం ఇష్టం లేక దంపతుల మధ్య గొడవలు జరుగుతుండేవని ఎస్‌ఐ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున ఇంటికి ఉన్న మెట్లకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. వీరికి రెండేళ్ల క్రితమే వివాహమయిందని చెప్పారు. మృతురాలి తల్లిదండ్రులు ఒడిషాలో ఉన్నారు. వారు వచ్చేందుకు రెండురోజులు సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో మృతదేహాన్ని బళ్లారి విమ్స్ మార్చురికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.


శుభశ్రీ ప్రధాన్ (ఫైల్)

కొడిగెనహళ్లిలో వ్యక్తి..

పరిగి: మండల పరిధిలోని కొడిగెనహళ్లి గ్రామానికి చెందిన ముత్యాలప్ప(50) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపిన మేరకు.. ముత్యాలప్ప కొంతకాలం నుంచి అనారోగ్య, ఆర్థిక సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురై సోమవారం తెల్లవారుజామున బాత్రూమ్‌లో వైరుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన భార్య కేకలు వేయగా చుట్టుపక్కలవారు తలుపులు పగలకొట్టి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు సంఘటనా పరిశీలించారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు..


సురేష్ మృతదేహం

సోమందేపల్లి : మండల కేంద్రంలోని దుర్గానగర్‌కు చెందిన కుమ్మరి సురేష్(34) అనే యువకుడు ఆదివారం రాత్రి పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సురేష్ చేనేత కూలీగా పనిచేస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. పెళ్లి కాలేదన్న బెంగతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబ సభ్యులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హిందూపురానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఇతడికి తల్లి జయమ్మ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

రొద్దం: మండలంలోని సుబ్బరాయప్పగారికొట్టాల గ్రామానికి చెందిన బోయ రామన్న(78) అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సోమవారం ఉదయం 6 గంటలకు ఆసుపత్రికి వెళ్లివస్తానని చెప్పి గ్రామ సమీపంలోని పూజమ్మ దేవాలయం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వృద్ధుడు చాలా కాలంగా ఉబ్బసం వ్యాధితో బాధపడుతూ.. ఎన్నో ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధురాలు..

తాడిపత్రి: ఒంటరితనాన్ని భరించలేక పట్టణంలోని శ్రీనివాసపురంలో నివాసం ఉంటున్న శేషమ్మ (65) అనే వృద్ధురాలు సోమవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుల్లన్న, శేషమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారందరికి వివాహాలు చేసి దంపతులు పక్కన ఉంటూ జీవనం సాగించేవారు. నాలుగు నెలల క్రితం భర్త పుల్లన్న మృతి చెందడంతో శేషమ్మ దిగాలుగా ఉంటూ ఒంటరి జీవితం గడుపుతుండేది. ఈ నేపథ్యంలో మనస్థాపంతో ఆమె ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పితో యువతి..

ధర్మవరం: కడుపునొప్పితో ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు...పట్టణంలోని గుట్టకిందపల్లికి చెందిన ఓబుళేసు, విజయలక్ష్మీ దంపతుల కుమార్తె పుష్పలత (23) డిగ్రీ పూర్తి చేసింది. తండ్రి బేల్దారి పనులు చేస్తుండగా, తల్లి రైల్వేక్యాంటీన్‌లో పనిచేస్తోంది. యువతి కడుపు నొప్పితో బాధపడుతుండేది. దీనికితోడు తల్లిదండ్రులు గొడవ పడేవారన్నారు. ఈ క్రమంలో పుష్పలత సోమవారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో మెటికలకు అమర్చిన ఇనుపతీరుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎంపీపీ ఇసుక డంప్

- 73 ట్రాక్టర్ల ఇసుక అక్రమ నిల్వలు
- మైనింగ్ అధికారుల నోటీసులు

కూడేరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక పాలసీ అమల్లోకి రావడంతో కూడేరు వైసీపీ ఎంపీపీ నారాయణ రెడ్డికి కలిసొచ్చింది. బెళుగుప్ప మండలం కాలువపల్లి వద్ద నుంచి దాదాపు 73 ట్రాక్టర్లకుపైగా ఇసుకను పి. నారాయణపురం గ్రామంలో అక్రమంగా నిల్వ చేశారు. అభివృద్ధి పనుల పేరిట పెద్ద ఎత్తున ఇసుక నిల్వ చేయడంతో సమాచారం అందుకున్న విజిలెన్స్, మైనింగ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో దాదాపు 73 ట్రాక్టర్లకు పైగా నిల్వ చేసి ఉంటారని అధికారులు గుర్తించారు. ఇసుక నిల్వ చేసిన గడ్డి దొడ్డి యజమానితోపాటు ఎంపీపీ నారాయణరెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు జిల్లా మైనింగ్, జియాలజీ అధికారి ఆదినారాయణ తెలిపారు. దాదాపు 280 టన్నుల ఇసుక అక్రమంగా నిల్వ ఉంటుందని, దీంతో సంబంధిత వ్యక్తులకు నోటీసులు పంపుతున్నామని వివరించారు. సరైన సమాధానం ఇవ్వకపోతే జరిమాన విధిస్తామని అన్నారు.


గ్రామంలో నిల్వ చేసిన ఇసుక డంప్

లోకో షెడ్‌లో పట్టాలు తప్పిన రైలింజన్

గుంతకల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో సోమవారం మధ్యాహ్నం ఓ విద్యుత్ లోకో పట్టాలు తప్పింది. ఇంజన్‌ను ముందుకు తీసుకెళ్తుండగా రెండు చక్రాలు పట్టాలు దిగాయి. దీంతో ఇంజన్‌ను నిలిపివేసి రెస్టోరేషన్ పనులను చేపట్టారు. ఇంజన్ డీరైల్మెంటు ప్రధాన లైన్‌లో కాకుండా, లోకో షెడ్‌లో చోటుచేసుకున్న కారణంగా రైళ్లకు ఎలాంటి ఆటంకాలు కలగలేదు. మధ్యాహ్నం నుంచి రాత్రిదాకా ట్రాక్ మరమ్మతులను చేపట్టారు.


పట్టాలపై నుంచి కిందకు దిగిన రైలింజన్ చక్రాలు

స్పెషల్ టీచర్లుగా ఐఈఆర్పీలు..?

- సర్టిఫికెట్లు పరిశీలించిన విద్యాశాఖాధికారులు

అనంతపురంవిద్య, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లల కోసం కొన్నేళ్లుగా సమగ్రశిక్ష శాఖ ద్వారా పనిచేస్తున్న ఐఈఆర్పీలకు మంచిరోజులు వచ్చినట్లు కనబడుతోంది. అలాంటి పిల్లలు ఉన్న పాఠశాలలకు స్పెషల్ టీచర్లను నియమించడానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి కొన్నేళ్లుగా ఐఈఆర్పీ (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లుగా పనిచేస్తున్న వారికి రెగ్యులర్ స్పెషల్ టీచర్లుగా అవకాశం కల్పించడానికి అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగానే ఐఈఆర్పీల విద్యార్హత , సర్వీస్ సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నారు. రాష్ట్రవిద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు సోమవారం జిల్లా సైన్స్ సెంటర్‌లో సర్టిఫికెట్లను పరిశీలించారు. జిల్లాలోని 31 మండలాలలో భవితా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో సమగ్రశిక్ష గణాంకాల మేరకు 61 మంది ఐఈఆర్పీలు పనిచేస్తున్నారు. వీరందరిని విద్యాశాఖ అధికారులు పిలిపించి విద్యార్హతలను పరిశీలించారు. డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఎంఈఓలతో ఏర్పాటు చేసిన కమిటీలు సర్టిఫికెట్లను పరిశీలించాయి. కార్యక్రమంలో సమగ్రశిక్ష సూపరింటెండెంట్ పెద్దయ్య, విద్యాశాఖ ఐటీ సెల్ ఏపీఓ మంజునాథ్, చంద్రశేఖరరెడ్డి ఎంఈఓలు శివకుమార్, నారపరెడ్డి, మదన్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు, అధికారులు

మామూళ్లా... రాజకీయమా..?

- సస్పెండైన సబ్‌రిజిస్ట్రార్‌కు మళ్లీ అదే సీటు
- కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్‌గా రామ్మోహన్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖలో అవినీతికి అంతులేకుండా పోతోంది. సబ్‌రిజిస్ట్రార్ల సీట్ల విషయంలో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. సస్పెండైన సబ్‌రిజిస్ట్రార్లను మళ్లీ అదే సీటులో నియమిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రామ్మోహన్ నాయుడును కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2023లో సేల్ డీడ్‌గా జరిగిన రిజిస్ట్రేషన్‌ను అవతలి పార్టీ లేకుండానే డాక్యుమెంట్ రద్దు చేయడం వివాదం రేపింది. ఈ విషయంపై ఆయనను అప్పట్లో సస్పెండ్ చేశారు. అనంతరం ఆయన బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. అదే కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి రూ.5 లక్షలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. దీంతో అతడిని సస్పెండ్ చేశారు. గతంలో పనిచేస్తున్న నారాయణస్వామి సస్పెండ్ కాగా.. మళ్లీ అక్కడికే కేటాయించడం గమనార్హం. తాజాగా మురళి అనే సీనియర్ అసిస్టెంట్‌ను అక్కడ నియమించారు. ఇంతలో ఏం జరిగిందో కానీ, రామ్మోహన్‌ను కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు. మురళిని బుక్కపట్నానికి బదిలీ చేశారు. దీంతో మురళి రిలీవ్ అవగా.. రామ్మోహన్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. తరచూ ఏసీబీ తనిఖీల్లో పట్టుబడటం, డబుల్ రిజిస్ట్రేషన్లు తదితర వ్యవహారాలు జరుగుతున్నా ఉన్నతాధికారుల్లో మార్పు రాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ నియామకం విషయంలో ఉన్నతాధికారుల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముదుపులా.. అధికారపార్టీ రాజకీయం పనిచేసిందా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

స్నేహితుడికి డబ్బులిచ్చి మోసపోయా..

- సెల్ఫీ వీడియో తీసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడిని నమ్మి, డబ్బులిచ్చి మోసపోయానంటూ పట్టణానికి చెందిన కృష్ణగౌడ్.. సెల్ఫీ వీడియో తీసుకుని, సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. కృష్ణగౌడ్.. స్నేహితుడైన వెంకటేశ్‌కు రూ.15 లక్షల వరకు అప్పు చేసి ఇచ్చాడు. ఆ డబ్బు ఇవ్వాలని పలుమార్లు అడిగినా వెంకటేశ్ పట్టించుకోలేదు. పదిరోజుల క్రితం పట్టణ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాడు. పోలీసులు పట్టించుకోలేదని బాధితుడి కుటుంబ సభ్యులు వాపోయారు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపం చెందిన కృష్ణగౌడ్ పట్టణ శివారులోని కన్నేపల్లి అటవీ ప్రాంతంలో బాధను వెల్లగక్కుతూ, పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. స్నేహితుడు వెంకటేశ్, ప్రకాశ్, జయమ్మ ఇందుకు కారణమని సెల్ఫీ వీడియోలో తెలిపాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని అటుగా వెళ్లిన గొర్రెల కాపర్లు గమనించి, ద్విచక్రవాహనంలో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై పట్టణ సీఐ హరినాథ్ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.


కృష్ణగౌడ్

కుంభాభిషేకానికి తరలిరండి: ఈఓ

గుంతకల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కసాపురం దేవస్థానంలో 40 ఏళ్ల తర్వాత జరుగుతున్న కలశ స్థాపన, కుంభాభిషేక కార్యక్రమాలను తిలకించడానికి భక్తులు తరలి రావాలని ఆలయ ఈఓ విజయరాజు పిలుపునిచ్చారు. సోమవారం కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థాన ఆవరణలో ఈఓ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవస్థాన అభివృద్ధికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో ప్రణాళికను రూపొందించామని తెలిపారు. ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలకు దాతల నుంచి భారీ స్థాయిలో స్పందన లభించిందన్నారు. అభివృద్ధి కార్యక్రమం కంటే ముందు గోపురాలకు కలశ స్థాపన చేయాలని చిన్న జీయర్ స్వామి సూచించారని అన్నారు. ఈ మేరకు ఈ నెల 31న దేవస్థాన గోపురాలన్నింటికీ కలశాల ఏర్పాటు, కుంభాభిషేకాన్ని చేపట్టనున్నట్లు వివరించారు. ఈ నెల 29న గుంతకల్లు పట్టణంలో 18 కలశాలతో శోభాయాత్రను వైభవంగా నిర్వహిస్తామన్నారు. 30న కలశాలకు పూజాదికాలను నిర్వహించి, 31వ తేదీ ఉదయం 11-10 గంటలకు గోపురాలకు కలశ స్థాపన, కుంభాభిషేక కార్యక్రమాలను చేపడతామని అన్నారు. కార్యక్రమానికి మంత్రులు, ప్రజా ప్రతినిధులు, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, దాతలను ఆహ్వానించామని అన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ పిడికిటి వెంకటేశ్వర్లు, ముఖ్య అర్చకుడు చక్రవర్తి, వేమన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కసాపురం ఆలయ ఈఓ విజయరాజు

ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు పెట్టిన ఘనుడు జగన్

- శాసనసభ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కుమారరాజా వర్ల

మడకశిరటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు పెట్టి జైలుకు పంపిన ఘనత వైసీపీ అధినేత జగన్‌కే దక్కుతుందని శాసనసభ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కుమారరాజా వర్ల పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు క్యాంప్ కార్యాలయంలో అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఎంఎస్ రాజు, రోషన్, విజయచంద్ర, ఎమ్మెల్సీ గ్రీష్మ, తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మంగళవారం అనంతపురం, సత్యసాయి జిల్లాల అధికారులతో అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సమావేశం అవుతామన్నారు. ఉదయం అనంతపురం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో 9 గంటల నుంచి రెండు గంటలపాటు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. జగన్ పాలనలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించారని, దీంతో ఎస్సీ, ఎస్టీ కాలనీలలో అభివృద్ధి సాగలేదని అన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు పెట్టించిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. ఆయన మూర్ఖత్వం వల్ల దళితులు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు ఇతర పథకాలకు వాడారన్నారు. ఎస్సీ ఎస్టీలను వేధింపులకు గురి చేశారని అన్నారు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 27 పథకాలను రద్దు చేశారని, చట్టాలను సైతం అతిక్రమించారని ఆరోపించారు. సత్యసాయి జిల్లాలో మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలపై వినతులు స్వీకరిస్తామని, అనంతరం జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు.



మాట్లాడుతున్న కుమారరాజా వర్ల

జడ్పీ మాజీ చైర్మన్ దేశాయి రెడ్డెప్పరెడ్డి మృతి

తనకల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పరాకువాండ్లపల్లికి చెందిన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దేశాయి రెడ్డెప్పరెడ్డి (87) సోమవారం స్వగృహంలోనే వయోభారం, అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. 1938లో సాధారణ రైతు కుటుంబీకులైన రామలక్ష్మమ్మ, నారాయణరెడ్డి దంపతులకు జన్మించిన రెడ్డెప్పరెడ్డి ఎమ్మెస్సీ వరకు చదువుకున్నారు. ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో.. ప్రభుత్వ ఉద్యోగం వద్దనుకుని రాజకీయాల్లో ప్రవేశించారు. 1976లో తనకల్లు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా గెలుపొందారు. మండల కేంద్రమైన తనకల్లులో నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని రప్పించారు. ఇందిరానగర్ పేరుతో ఇందిరాగాంధీ చేతులు మీదుగా పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయించారు. 1981లో కదిరి తూర్పు సమితి ప్రెసిడెంట్‌గా విజయం సాధించారు. అదే సంవత్సరం జూలైలో జడ్పీ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించి 1985 వరకు కొనసాగారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం విజయం సాధించినప్పటికీ అనంతపురం జిల్లాలో మాత్రం జడ్పీ చైర్మన్‌గా రెడ్డెప్పరెడ్డి కొనసాగారు. ఆయన మీద పెట్టిన అవిశ్వాసం కూడా వీగిపోయింది. 1985లో కాంగ్రెస్ పార్టీ నుంచి హిందూపురం పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేసి ఓడిపోయారు. 1991లో ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా ఎంపికై 1993 వరకు ఉన్నారు. తరువాత చిరంజీవి ప్రజా రాజ్యం పార్టీ స్థాపించడంతో అందులో చేరారు. 2014లో తెలుగుదేశం పార్టీలో చేరి అందులోనే కొనసాగుతున్నారు. సౌమ్యుడిగా, వివాదరహితుడిగా పేరు గడించారు. తనకల్లులో మార్కెట్‌యార్డ్, ఆసుపత్రి, హాస్టళ్ల ఏర్పాటులో తనదైన ముద్ర వేశారు.



బధిరుల రాష్ట్ర క్రికెట్ జట్టుకు అనంత వాసులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బధిరుల (చెవిటి మూగ) క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులకు చోటు దక్కింది. జిల్లాకు చెందిన గంగాధర్, పవన్‌కుమార్ ఏపీ రాష్ట్ర బధిర క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. నవంబరు 3 నుంచి న్యూఢిల్లీలో జరిగే 9వ జాతీయ బధిరుల టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున వీరు ఆడనున్నారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా స్పోర్ట్స్ చెవిటి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్, సత్యనారాయణరెడ్డి అభినందనలు తెలిపారు.


గంగాధర్


పవన్‌కుమార్

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

● పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



మాలధారులకు భిక్ష వడ్డిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పాతూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలో సోమవారం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, గురుస్వామి కుర్లపల్లి రంగాచారి ఆధ్వర్యంలో అయ్యప్పమాలధారులు పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి శబరిమలకు పాదయాత్ర చేపట్టిన 156 మంది మాలధారులు నగరానికి చేరుకోగా.. వారికి ఎమ్మెల్యే దగ్గుపాటి, కుర్లపల్లి రంగాచారి స్వాగతం పలికారు. పూజ అనంతరం అందరికీ భిక్ష అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తానుకూడా 1999 నుండి అయ్యప్ప దీక్ష చేపడుతున్నానన్నారు. ప్రస్తుతం 25వ సారి దీక్ష చేపట్టినట్లు చెప్పారు. అయ్యప్ప స్వామి కరుణాకటాక్షం ఉండబట్టే ఎమ్మెల్యే అయ్యానని పేర్కొన్నారు. అనంతరం కుర్లపల్లి రంగాచారిని ఎమ్మెల్యే సత్కరించారు ఆలయ గౌరవాధ్యక్షుడు గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో విజేతలకు అభినందనలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. ఇటీవల విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు కుశ్వంత్‌రెడ్డి, సుగ్రఫాతిమా, హేమశ్రీ, ప్రణవి సాయి పతకాలు సాధించారు. అత్యంత ప్రతిభ చాటిన కుశ్వంత్‌రెడ్డి నవంబరు 21వతేదీ నుంచి పంజాబ్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సోమవారం పతకాలు అందజేసి అభినందించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురుస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణమూర్తి



అనంతపురం విద్య, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణమూర్తి నియమితులయ్యారు. కుందుర్పి మండలానికి చెందిన ఈయన చాలా ఏళ్లుగా ఎస్టీయూ నేతగా సేవలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో అతడికి రాష్ట్రకార్యదర్శిగా అవకాశం కల్పిస్తూ సోమవారం రాష్ట్రకమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణమూర్తి రాష్ట్రకార్యదర్శిగా నియమితులైనందుకు జిల్లాఅధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజినేయులు అభినందనలు తెలిపారు.

భారత్ కమల్ పురస్కారం అందజేత



విజయసాయికుమార్‌కు పురస్కారం అందజేస్తున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ భారత్ కమల్ పురస్కార్-2025ను అందుకున్నారు. న్యూఢిల్లీకి చెందిన భారత్ సేవా సొసైటీ వారు ప్రతియేటా స్వచ్ఛంద సేవా సంస్థలకు ఈ పురస్కారాన్ని అందిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది పురస్కారం పంపిణీ ఢిల్లీలో చేపట్టారు. అయితే విజయసాయికుమార్ హాజరు కాలేకపోవడం వల్ల పురస్కారాన్ని నిర్వాహకులు కొరియర్ ద్వారా అనంతపురానికి పంపారు. దీంతో నగరంలోని సత్యసాయి కల్యాణమండపంలో సోమవారం ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆ పురస్కారాన్ని విజయసాయికుమార్‌కు అందజేసి సత్కరించారు. ట్రస్టు సిబ్బంది రాఘవేంద్ర, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

కనగానపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పీఎంఏవై ఇళ్లు మంజూరు చేయాలని డీసీఎంఎస్,మార్కెట్‌యార్డు చైర్మన్లు నెట్టెం వెంకటేష్, బోయపాటి సుధాకర్‌చౌదరి, టీడీపీ కన్వీనర్ యాతం పోతలయ్య అధికారులను కోరారు. మండలకేంద్రంలో సోమవారం వారు ఎంపీడీఓ అనిల్‌కుమార్, హౌసింగ్ ఏఈ మహేష్‌తో సమావేశం నిర్వహించి పీఎంఏవై ఇళ్ల మంజూరుపై చర్చించారు. ఇందుకు సంబంధించి గ్రామాల్లో నవంబరు 5లోగా సర్వే పూర్తి చేసి అర్హుల జాబితా సిద్ధం చేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నిజం చేయాలని, ఇందుకు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవ చూపుతున్నారని సూచించారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం విద్య, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి మ్యాథ్స్ ఒలింపియాడ్ పోటీలలో శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా 201మంది ఉత్తీర్ణత సాధించగా, అందులో నగరంలోని ఐపీఎల్ బ్రాంచ్‌కు చెందిన ఆదిత్యక్రిష్ణ, ప్రేమ్‌కుమార్,ప్రణీత్,రుత్విక్‌రెడ్డి, భగీరథరెడ్డి, యశ్వంత్‌రెడ్డి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్ తెలిపారు. ఆవిద్యార్థులను సోమవారం ఏజీఎం సుబ్బారెడ్డి అభినందించారు.

మరోసారి ఉద్యోగోన్నతులకు రంగం సిద్ధం

● 250 మంది గ్రేడ్-6 కార్యదర్శులకు గ్రేడ్-5గా ప్రమోషన్

● విధివిధానాలపై కసరత్తు



డీపీఓ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి మరో సారి ప్రమోషన్ల జాతరకు రంగం సిద్ధం అవుతోంది. ఏకంగా 250 మంది వరకు గ్రేడ్-6 కార్యదర్శుల (డిజిటల్ అసిస్టెంట్లు)కు గ్రేడ్-5 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతులు కల్పించడానికి యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేస్తోంది. ఈ నెలలోనే గ్రేడ్-5 కార్యదర్శుల నుంచి గ్రేడ్-4 కార్యదర్శులుగా 155 మంది ఉద్యోగోన్నతి పొందారు. దీంతో ఖాళీ అయిన ఆ 155 స్థానాలతో పాటు అప్పటికే ఖాళీగా ఉన్న మరో 95 స్థానాలు కలిపి ఏకంగా 250 మంది స్థానాల్లో ఉద్యోగోన్నతి కల్పించే దిశగా డీపీఓ నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో అధికారులు చర్యలు ముమ్మరం చేస్తున్నారు. అయితే ఉద్యోగోన్నతుల కల్పనలో ఎలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపట్టనున్నారు. ముఖ్యంగా పొజిషన్ ఐడీల సమస్య తలెత్తకుండా ఏమి చేయాలన్న దానిపై డీపీఓ కార్యాలయ సిబ్బంది తర్జన భర్జన పడుతున్నారు. ఈ విషయాన్ని కమిషనర్ కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు చేపట్టనున్నారు. జాబితాకు అనుగుణంగా సీనియారిటీ ప్రాతిపదికన గ్రేడ్-6 కార్యదర్శుల నుంచి గ్రేడ్-5 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి ప్రక్రియ చేపట్టనున్నారు. ఏమి చేస్తారు. ఎప్పటికి ప్రక్రియ పూర్తి చేస్తారన్నది తెలియాలంటే వేచి చూడాల్సిందే.

ఉపాధి పనుల్లో అలసత్వం తగదు: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల విషయంలో అలసత్వం వహించరాదని, ఏపీడీలు ఉదయం 6గంటలకే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఆయన జేసీ శివనారాయణ్‌శర్మతో కలిసి మొంథా తుఫాన్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, ఉపాధి హామీ పథకం, ఈపంట నమోదు, ఏపీఎంఐపీ, హౌసింగ్ తదితర అంశాలపై సంబంధిత అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద లేబర్ టర్నవుట్‌కు సంబంధించి గత వారంలో 3.72లక్షల లక్ష్యం ఉండగా, కేవలం 77,319 మంది కూలీలను మాత్రమే మొబిలైజేషన్ చేశారని, ఇది ఎంత మాత్రం తగదని అన్నారు. జిల్లాలో విడపనకల్లు, నార్పల, డీ.హీరేహాళ్, వజ్రకరూరు, పెద్దపప్పూరు తదితర 15 మండలాల్లో 20శాతం కన్నా తక్కువగా లక్ష్యాన్ని చేరుకున్నారన్నారు. ఆయా మండలాల్లో వెంటనే ఉపాధి పనుల లేబర్ టర్నవుట్‌లో పురోగతి తీసుకురావాలన్నారు. లేకపోతే చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని హెచ్చరించారు. విడపనకల్లు, బ్రహ్మసముద్రం మండలాల ఎంపీడీఓలు 15 వర్క్ సైట్ తనిఖీలలో ఒకటీ చేయలేదని, వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అలాగే అవెన్యూ ప్లాంటేషన్, పల్లెవనాలకు సంబంధించి, హౌసింగ్‌కు సంబంధించి పలు సూచనలు చేసి ఆదేశాలు ఇచ్చారు. ఇక పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించాలని సూచించారు.

విభిన్న ప్రతిభావంతుల చట్టం సమర్థవంతంగా అమలవ్వాలి

విభిన్న ప్రతిభావంతుల చట్టం సమర్థవంతంగా అమలయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వికలాంగుల హక్కుల చట్టం-2016, వికలాంగుల హక్కులపై జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దివ్యాంగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదన్నారు. అన్ని శాఖలలో దివ్యాంగులకు సంబంధించి రిజర్వేషన్ అమలు జరగాలని ఈ చట్టంలో పొందుపరచడం జరిగిందన్నారు. చట్టం ఉల్లంఘనకు ఎలాంటి వీలు లేదని ఆదేశించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ...జిల్లాలో దివ్యాంగులకు, జిల్లా అధికారులకు న్యాయ సేవా సదన్‌లో ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, డీపీఓ నాగరాజు నాయుడు, జడ్పీ సీఈఓ శివశంకర్, డీఆర్‌డీఏ పీడీ శైలజ, డీఎంహెచ్ఓ ఈబీ దేవి తదితరులు పాల్గొన్నారు.

అనంతకు చేరిన ఎస్సీ సంక్షేమ శాసనసభ కమిటీ



కమిటీ సభ్యులకు స్వాగతం పలుకుతున్న ఎస్సీ సంక్షేమశాఖ అధికారులు

అనంతపురం విద్య, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సంక్షేమ శాసన సభ కమిటీ జిల్లాకేంద్రానికి చేరుకుంది. ఎస్సీ సంక్షేమపథకాల సమీక్షలో భాగంగా కమిటీ జిల్లాలో మంగళవారం కమిటీ పర్యటించనుంది. అందులో భాగంగా సోమవారం రాత్రి కమిటీ చైర్మన్ కుమారరాజా వర్ల, శాసనసభ్యులు కొలికిపూడి శ్రీనివాస్‌రావు, ఎంఎస్‌రాజు, తాటిపర్తి చంద్రశేఖర్, రోషన్‌కుమార్, ఎమ్మెల్సీ కావలిగీష్మ జిల్లాకేంద్రానికి చేరుకున్నారు. వారికి ఎస్సీసంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ కుష్బూకొఠారి, ఏఎస్‌డబ్ల్యూఓలు రామునాయక్, రామ్మోహన్, శ్రీనివాసులు తదితరులు ఘన స్వాగతం పలికారు. వారికి రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ రెసిడెన్సీలో రాత్రి బసకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎస్సీలతో వినతులు స్వీకరించనున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం చేపట్టింది.

రైతులకు పరిహారం ఇవ్వాలి

అనంతపురంరూరల్/శింగనమల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుఫాన్ కారణంగా పంటలను నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఉన్న అరకొర పంటలను గిట్టుబాటు ధరతో రైతుసేవా కేంద్రాల్లో కొనుగోలు చేయాలన్నారు. ఆమేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. అలాగే శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.చిన్నప్పయాదవ్ రైతులతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

బస్సు జాతా పోస్టర్ల విడుదల

నార్పల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బస్సు జాతా పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను, విద్యారంగ సమస్యల్ని పరిష్కరించాలంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బస్సుయాత్ర ఈనెల 22న ఇచ్ఛాపురంలో ప్రారంభం కానుందన్నారు. నవంబరు 12న అనంతపురంలో ముగుస్తుందన్నారు. విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనమంతరాయుడు, ఉపాధ్యక్షుడు మంజునాథ్, కోశాధికారి ఆంజనేయులు, నియోజకవర్గ కార్యదర్శి నవీన్, సహాయ కార్యదర్శి హుసేన్ పాల్గొన్నారు.

1,822 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

అనంతపురం అర్బన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1,822 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్‌లో వ్యాగిన్లలో వచ్చిన యూరియాను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జేసీ ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు 1220, ప్రైవేటు డీలర్లకు 602 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

మొంథా తుఫాన్‌పై సమీక్ష

రామగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌పై మండల కేంద్రంలో సోమవారం మండల అధికారులు సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ రవికుమార్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్, ఎంపీడీఓ గంగావతి, వైద్యుడు ప్రతాప్ అధికారులతో సమీక్ష జరిపి మాట్లాడారు. ఎడతెరపి లేని వర్షాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామాలలో ప్రజలకు విస్తృత ప్రచారం చేయాలన్నారు. మట్టిమిద్దెలలో, చెట్లకింద, కరెంటు తీగల కింద ఉండరాదని తెలియజేయాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా వెంటనే తహసీల్దార్ కార్యాలయం కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించేలా అవగాహన కల్పించాలని సూచించారు.

ఏఐటీయూసీలోకి పలువురు అంబులెన్స్ డ్రైవర్లు

అనంతపురం విద్య, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్ డ్రైవర్లు పలువురు ఏఐటీయూసీలోకి చేరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి సమక్షంలో వారు సోమవారం చేరారు. ఈసందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు కాపాడడంలో అంబులెన్స్ డ్రైవర్ల పాత్ర కీలకమన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్‌గౌడ్, కృష్ణుడు, సంతోష్, తిమ్మన్న, గోపాల్, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు రోటరీక్లబ్ సభ్యులు క్రీడాసామగ్రి అందజేశారు. బుక్కరాయసముద్రం మండలం సిద్దరాంపురం గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో క్రీడాకారుల కోసం రగ్బీ, వాలీబాల్, హాకీ, బ్యాడ్మింటన్ తదితర క్రీడలకు సంబంధించిన సామగ్రిని పీఈటీ నాగరాజుకు అందజేసినట్లు రోటరీక్లబ్ అనంతపురం సెంట్రల్ సభ్యులు తెలిపారు. పేద క్రీడాకారులకు తమ వంతుగా అండగా ఉండాలని ఈ సామగ్రిని అందజేసినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు గల్లా హర్ష, యువజన సేవల చైర్మన్ తైక్వాండో శాంతరాజ్, కోశాధికారి ఎంవి పాండురంగయ్య తెలిపారు.

'ఏడాదికి రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేయలేరా?'

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఏడాదికి రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసినా 10 మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వస్తాయని, ప్రభుత్వం ఆ మాత్రం ఆలోచన ఎందుకు చేయడం లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఓబిరెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ జరిగింది. ఇందులో అనంత వెంకటరామిరెడ్డి పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు తన నిర్ణయాన్ని మార్చుకుని ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల నిర్మాణాలు చేపట్టాలన్నారు. మెడికల్ కళాశాలలకు రూ.5వేల కోట్లు ఖర్చు చేయలేమని సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు చెప్పడం సిగ్గుచేటన్నారు. వామపక్షాలు, ప్రజాసంఘాలు, మేధావులు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్‌లో ఎస్‌బీఐ ఉద్యోగులు



ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్‌లో పాల్గొన్న ఎస్‌బీఐ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తించుకోవాలని ఎస్‌బీఐ ఆర్ఎం రమేష్‌బాబు సూచించారు. నగరంలో సోమవారం ఎస్‌బీఐ ఉద్యోగులు పరిశుభ్రత-ఆరోగ్యంలో భాగంగా ఫిట్ ఇండియా ఫ్రీడమ్‌రన్ 6.0ను నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినగర్ నుంచి సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు, టవర్‌క్లాక్, ఆర్ట్స్ కాలేజీ, శ్రీకంఠం సర్కిల్ మీదుగా ఎస్‌బీఐ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఆర్ఎం మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాలని, ఎంత బిజీలో ఉన్నా సరే ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొద్ది సమయాన్ని వెచ్చించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్‌మేనేజర్ వేణుగోపాల్, హెచ్ఆర్ మేనేజర్ సురేంద్రకుమార్, మేనేజర్లు చంద్రమోహన్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

భూమి కోసం బెదిరిస్తున్నారు..

● ఎస్పీ ఎదుట వృద్ధురాలి ఆవేదన



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తనకు ప్రభుత్వం ఇచ్చిన 70 సెంట్ల భూమిని బెదిరించి లాక్కోవాలని చూస్తున్నారంటూ 82 ఏళ్ల వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీకి చెందిన ఓ కార్పొరేటర్ కొడుకు 70 సెంట్ల భూమి కోసం బెదిరిస్తున్నాడంటూ వృద్ధురాలు అనసూయమ్మ... ఎస్పీ కార్యాలయం వద్ద వాపోయారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక వద్దకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, బాధితులు తరలివచ్చారు. ఎస్పీ జగదీష్. ప్రజల నుంచి 145 పిటీషన్లు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

70 సెంట్ల భూమి కోసం వేధింపులు...

ఉప్పరపల్లిలో ఉన్న తన 70 సెంట్ల భూమి కోసం వైసీపీ కార్పొరేటర్ కొడుకు వేధిస్తున్నాడంటూ అనసూయమ్మ వాపోయారు. ఎస్పీని కలిసేందుకు వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడారు. సుమారు ఇరవై ఏళ్ల కిందట ప్రభుత్వం ఉప్పరపల్లి పొలంలోని 103-1 సర్వే నంబరులోని 70 సెంట్ల భూమి ఇచ్చిందన్నారు. తాను పవర్ ఆఫీస్ వద్ద బజ్జీలు వేసుకుని జీవనం సాగిస్తున్నానన్నారు. వైసీపీ కార్పొరేటర్ కుమారుడు తనకే భూమి అమ్మాలంటూ వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని లాక్కోవాలని బెదిరిస్తున్నాడని, పోలీసులు న్యాయం చేయాలని కోరారు.

రాజకీయ ఉనికి కోసమే అసత్య ప్రచారం



కనగానపల్లిలో మాట్లాడుతున్న చైర్మన్లు, నాయకులు

కనగానపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే పరిటాల కుటుంబంపై లేనిపోని ప్రచారం చేస్తున్నారని డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు, రాప్తాడు మార్కెట్‌యార్డు చైర్మన్ బోయపాటి సుధాకర్‌చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య అన్నారు. మండలకేంద్రంలోని పరిటాల భవన్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. కోర్టులో ఉన్న పాపంపేట భూములను కబ్జా చేస్తున్నారంటూ పరిటాల కుటుంబంపై ప్రకాష్‌రెడ్డి అపద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆయన కేవలం రాజకీయ ఉనికి కోసమే ఇదంతా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మానాలన్నారు. లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. పాపంపేట ప్రజలకు పరిటాల కుటుంబమే న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. సర్పంచ్ అంకే రామక్రిష్ణ, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, క్లస్టర్ ఇన్‌చార్జిలు రాజాక్రిష్ణ, బిల్లే దాము, తెలుగుయువత బట్టా సురేష్‌చౌదరి పాల్గొన్నారు.

'పరిటాల కుటుంబానికి సంబంధం లేదు'

రాప్తాడు: పాపంపేట భూవివాదంలో పరిటాల కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని టీడీపీ ఎస్సీ సెల్ రాప్తాడు నియోజకవర్గ అధికార ప్రతినిధి గంజి నరేష్ తెలిపారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాజీఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రాజకీయ ఉనికి కోసమే పాపంపేట భూ వివాదంలోకి పరిటాల కుటుంబాన్ని లాగుతున్నారన్నారు.

పనుల పరిశీలన

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన వివిధ పనులను ఆడిట్ కమిటీ పరిశీలించింది. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మార్గదర్శకాల మేరకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై థర్డ్ పార్టీ ఆడిట్ చేపట్టారు. ఇందులో భాగంగా తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ సురేష్‌జైన్ ఆధ్వర్యంలో ఆడిట్ కమిటీ సభ్యులు నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. పలు ప్రాజెక్టులు, పచ్చదనం, అభివృద్ధి, జంక్షన్ అభివృద్ధి, కాలుష్య నియంత్రణ చర్యలు, వాహనాల క్రమబద్ధీకరణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి పనులపై ఆడిట్ నిర్వహించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో ఆయా అంశాలపై చర్చించారు. ప్రస్తుతం నగరంలో కాలుష్యనియంత్రణ, పచ్చదనంపై కేంద్ర ఆడిట్ బృందం సంతృప్తి వ్యక్తం చేసినట్లు కమిషనర్ బాలస్వామి తెలిపారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఏఎంసీ ఈఈ షాకీర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

రామగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్టు బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో కార్తీక వనమహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అడవులను సంరక్షిద్దాం, కాలుష్యాన్ని నివారిద్దామంటూ నినాదాలు చేశారు. అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మాట్లాడుతూ.. అడవుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని అన్నారు. అడవులను కాపాడితే అవి మనల్ని కాపాడతాయని చెప్పారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, వన్యప్రాణులను కాపాడాలని సూచించారు. గుట్టూరు ఎఫ్‌బీఓ రత్నమ్మ, కొండపల్లి ఎఫ్‌బీఏ శిరీష, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడాపోటీలు



చియ్యేడులో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ లక్ష్మీనారాయణ

అనంతపురంరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యేడు ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు జోరుగా సాగాయి. స్థానిక సొసైటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ వరలక్ష్మి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం పోటీలను నిర్వహించగా.. కబడ్డీ అండర్ -14 విభాగంలో చియ్యేడు పాఠశాల విజయం సాధించింది. అండర్ -17 కబడ్డీ బాలుర విభాగంలో గ్లోబల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విన్నర్‌గా నిలవగా..వాలీబాల్ అండర్ -14విభాగంలో ఏజీఎస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విజేతగా నిలిచింది. మండల స్థాయిలో విజయం సాధించిన వారు త్వరలో అనంతపురం నగరంలో జరిగే డివిజనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం విశ్వనాథ్, ఎస్.ఈఎఫ్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం బాలికల పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు.

●చెన్నేకొత్తపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజున విద్యార్థులకు లాంగ్‌జంప్, పరుగుపందెం, హైజంప్, జావెలిన్ త్రో, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచిన వారిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికచేశారు. మంగళవారం కూడా పలు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు పీడీ విజయనిర్మల తెలిపారు.

●రామగిరి: మండలకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను ఎంఈఓ ప్రసాద్, ఉన్నతపాఠశాల హెచ్‌ఎం మహాలక్ష్మి ప్రారంభించారు. మండలం నుంచి 9 ఉన్నతపాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పరుగు పందెం, కబడ్డీ, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావిలెన్‌త్రో తదితర పోటీలు నిర్వహించారు. వీటిల్లో కుంటిమద్ది, పేరూరు ఎంజేపీ, పోలేపల్లి, దీక్షిత ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపి డివిజన్ స్థాయికి ఎంపికయ్యారు. పీఈటీలు చిత్రా ఓబుళేశు, విజయలక్ష్మి, అమి, సురేశ్, వారాది, నాగార్జున, నరేశ్, చంద్రకళ పాల్గొన్నారు.

●నార్పల: మండలకేంద్రంలోని క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను తహసీల్దార్ అరుణ, ఎంఈఓ కిష్టప్ప. స్థానిక ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రవికుమార్ ప్రారంభించారు. ఇందులో మండలవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు పాల్గొనగా.. వారికి కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని డివిజన్‌స్థాయికి ఎంపిక చేశారు. పీడీలు శ్రీనివాసులు, సుజాత, కాటమయ్య, రామన్న, శ్రీదేవి, నసీమాబేగం, సురేఖ పాల్గొన్నారు.

●శింగనమల: మండలంలోని ఆకులేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండలస్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. మొదటి రోజున బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా అండర్ 14-17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల హెచ్‌ఎం గోవిందరాజులు, పీఈటీ నగేష్‌బాబు తెలిపారు. అనంతరం ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులకు మదిరేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నల్లాని మోహన్‌నాయుడు టీషర్టులు వితరణ చేశారు. సర్పంచ్ రామాంజినేయులు,పీఈటీలు నరసింహారెడ్డి బయపరెడ్డి సునీత, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా కార్తీక దీపోత్సవం

రాయదుర్గం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీభక్తమార్కండేయస్వామి దేవాలయంలో సోమవారం రాత్రి కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని భీమనపల్లి, జరబండి వంశస్థులు కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా ఆలయంలో దీపోత్సవాన్ని నిర్వహించారు. ఉదయాన్నే పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, మహామంగళహారతి, అనంతరం సాయంత్రం గరుడ స్థంభం దీపోత్సవాన్ని, పల్లకి సేవను నిర్వహించారు.

కార్తీక జ్యోతి... పరబ్రహ్మ స్వరూపం



శివాచార్యస్వామి

కణేకల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో వెలిగించే జ్యోతి పరబ్రహ్మస్వరూపమని పాల్తూరు పీఠాధిపతి శ్రీచెన్నవీర శివాచార్యస్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానిక శ్రీచిక్కణ్ణేశ్వర ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపం యొక్క విశిష్టతను భక్తులకు వివరించారు.

పుట్లూరులో తాగునీటి సమస్య



పొలాల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న దృశ్యం

పుట్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జేసీ నాగిరెడ్డి తాగునీటి పథకం పైప్‌లైన్ పగలడంతో మండల కేంద్రంలోని ప్రజలు సుమారు 15 రోజులుగా తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. బోర్లలో అరకొర నీరు వస్తుండటంతో వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. వర్షపునీటిని బకెట్లలో పట్టుకొని అవసరాలకు వాడుకుంటున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

జంగమ సంఘం ఉపాధ్యక్షుడిగా బండయ్య



ఉరవకొండ, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా ఉరవకొండకు చెందిన బండయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన కర్నూల్‌లో ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు.

దర్గాహొన్నూరులో వెలగని వీధిలైట్లు

బొమ్మనహాళ్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో వీధిలైట్లు నెలల తరబడి వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలు పడుతుండటంతో రాత్రివేళ్లలో విషపురుగులు, పాములు తిరుగుతున్నాయి. రాత్రివేళ బయటకు రావడానికే జనం జంకుతున్నారు. దీనిపై స్థానిక ప్రజప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్థులు వాపోతున్నారు.



బస్సు ఎక్కి నిరసన తెలుపుతున్న హిజ్రా

దందాపై హిజ్రాల నిరసన

గుంతకల్లుటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హిజ్రా ముసుగులో దందా చేస్తున్న అనంతపురానికి చెందిన ఆసీఫ్‌ను అరెస్ట్ చేయాలని హిజ్రాలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. వచ్చిపోయే బస్సులను అడ్డగిస్తూ బస్‌పై ఎక్కి, ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిరసన తెలిపారు. ఆసీఫ్ తమను భయపెట్టి ప్రతి నెలా లక్షలు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. ఆసీఫ్ నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని పోలీసుల కాళ్లపట్టుకుని వేడుకున్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

తాడిపత్రి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వాలని, లేకుంటే ప్రభుత్వ భూములను పేదలకు పంచుతామని ఏపీ వ్యవసాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ పేర్కొన్నారు. మండలంలోని అక్కన్నపల్లి గ్రామం వద్ద ప్రభుత్వ భూములను సోమవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. 1998లో కుటుంబ నియంత్రణ కింద బటన్‌హోల్ ఆపరేషన్ చేయించుకున్న 94మందికి అప్పటి చంద్రబాబు ప్రభుత్వం రెండు సెంట్ల ప్రకారం స్థలాలు ఇచ్చి పట్టాలు ఇచ్చారన్నారు. కానీ పట్టాలు పొందిన వారికి ఆ స్థలాలు ఇవ్వకుండా కొంతమంది నాయకులు రియల్‌ఎస్టేట్ ముసుగులో ఆక్రమించుకోవాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వం వారికి న్యాయం చేసి పట్టాలు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రంగయ్య, జిల్లా కార్యదర్శి కేశవరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

గవిమఠం భూముల్లో అక్రమాలు

● లీజుల్లో మాయాజాలం
● పేరుకుపోయిన బకాయిలు
● ఆదాయానికి గండి

ఉరవకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గవిమఠం ఆస్తుల లీజుల వ్యవహారంలో వ్యాపారుల మాయాజాలం కొనసాగుతోంది. కొంతమంది గవిమఠం స్థలంలో బంకులు, భవనాలు నిర్మించి, వాటిని మరొకరికి సబ్‌లీజుకు ఇస్తూ దేవదాయశాఖ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇచ్చిన స్థలం కంటే అదనంగా స్థలాన్ని ఆక్రమించుకున్నారు. నామమాత్రంగా అద్దె చెల్లిస్తూ, లీజుదారులు మాత్రం రూ. లక్షలు గడిస్తున్నారు. గవిమఠంలో ఉన్న స్థలాలకు సంబంధించి ఇంకా రూ.లక్షల్లో బకాయిలున్నాయి. కొంతమంది లీజుదారులు, దేవదాయశాఖలోని అధికారులు సిబ్బందితో కుమ్మక్కై ఈ తతంగం నడిపిస్తున్నారన్న విమర్శలున్నాయి. దేవదాయశాఖ చట్టం ప్రకారం ప్రతి మూడు ఏళ్లకు ఒక్కసారి లీజుదారుడు హక్కులను పునరుద్ధరించుకోవాలనే నిబంధనలున్నా అవి అమలు కావడం లేదు.

● **అభివృద్ధి శూన్యం:** ఈ మఠానికి, ఏపీ, తెలంగాణ కర్ణాటక రాష్ట్రాలలో 770 ఉప మఠాలున్నాయి. మూడు రాష్ట్రాల్లో 2,943 ఎకరాల భూమి ఉంది. పట్టణంలోని మఠం స్థలంలో 314 దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా రూ.2 కోట్లు ఆదాయం వస్తోంది. అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఆదాయం వస్తోంది. ఏడాదికి రూ.1.2 కోట్లు మిగులుతున్నా, గవిమఠం అభివృద్ధి మాత్రం శూన్యం. గవిమఠం భవనాలు శిథిలమవుతున్నాయి. గర్భగుడితోపాటు, ఇతర గదులు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆదాయమున్నా వీటిని మరమ్మతులు చేయడం లేదు.

● **యథేచ్ఛగా అక్రమాలు..:** గవిమఠం ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులే అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి ఏసీ తన పేరుమీద గవిమఠం భూములను లీజుకు తీసుకుని.. వైసీపీ వర్గీయులకు భూములను లీజ్‌కు ఇచ్చారు. అంతేకాకుండా మరొకరికి ఏకంగా అమ్మేశాడు. వారిని ప్రశ్నించే వారు లేకపోవడంతో వారి అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయాయి. అలాగే సర్వే నెంబర్ 473లో ఉన్న 17 ఎకరాలను పేదల ఇళ్ల స్థలాల కోసం ఓ సంఘానికి నామమాత్రపు ధరకు విక్రయించారు. రూ.కోట్ల విలువ చేసే ఈ భూములతో కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసి సొమ్ము చేసుకున్నారు. నిరుపేదలకు ఆ స్థలాలు ఇవ్వకుండా బడాబాబులకు విక్రయించి.. సొమ్ము చేసుకున్నారు. ఈ విషయంపై గవిమఠం ప్రస్తుత ఏసీ రాణి వివరణ కోరగా.. లీజుదారుల స్థలాన్ని ఆక్రమించుకున్నది నిజమేనని, వాటిని పరిశీలిస్తున్నామని, లీజుదారుల హక్కుకు సంబంధించి 2026 మార్చితో పూర్తి అవుతుందని అన్నారు.





లీజు కంటే అదనంగా ఆక్రమించుకున్న స్థలం, మఠంలో పాఠశాలకు ఇచ్చిన స్థలం



ఉరవకొండలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఉరవకొండలో కుండపోత

ఉరవకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఉరవకొండలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఏకధాటిగా వర్షం రావడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రహదారులపై వర్షపు నీరు నిలవడంతో పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టవర్ క్లాక్ కూడలిలో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడ్డారు.

నష్టపోయిన చేనేతల వివరాలు సేకరించండి : మంత్రి
పట్టణంలో సోమవారం కురిసిన వర్షానికి ఇంద్రానగర్, డ్రైవర్స్ కాలనీల్లో ఇళ్లలో ఉన్న మగ్గాల గుంతల్లోకి వర్షపు నీరు చేరడంతో మగ్గాలు దెబ్బతిన్నాయి. దీంతో నష్టపోయిన చేనేతల వివరాలను సేకరించాలని మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులకు ఆదేశించారు.

● **రాయదుర్గం:** పట్టణంలో సోమవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. గంటపాటు పెద్దఎత్తున కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రామదాసవీధి, కొలిమివీధి, మధుటాకీస్, ముత్రాసికాలనీలతో పాటు వివిధ లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు ఇళ్లల్లోకి చొరబడ్డాయి. లక్ష్మీబ జార్, శాంతినగర్, ప్యాలెస్‌రోడ్డు ప్రాంతాలలో ప్రధానరోడ్లపై వరదనీరు పెద్ద ఎత్తున చేరుకుని రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగించాయి.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు

కణేకల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పడే ఎలెక్ట్రికల్ సమస్యలు పరిష్కరించడానికి 50 మంది సభ్యులతో కూడిన బృందం సిద్ధంగా ఉన్నట్లు కాంట్రాక్టర్ బాయినేని నవీన్ తెలిపారు. తుఫాన్ ప్రభావం వల్ల విద్యుత్ సమస్యలు నెలకొంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకొని రావాలని సూచించారు.

రాయదుర్గంలో కంట్రోల్ రూం

రాయదుర్గం: మొంథా తుఫాన్ నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో రాయదుర్గంలో కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణ ప్రజలు 85550 79096 నంబరుకు ఫోన్ చేస్తే సహాయకచర్యలు అందుతాయని తెలిపారు.

పశునష్టం వాటిల్లితే సమాచారమివ్వండి

పెద్దవడుగూరు: మండలంలోని ఏ గ్రామంలోనైనా తుఫాన్ కారణంగా పశువులు, గొర్రెలు, మేకల మరణిస్తే 99630 06707, 87122 57082 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. రైతుసేవా, పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు.

వ్యాసాపురంలో తాగునీటి కష్టాలు

ఉరవకొండ,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు కూలడంతో వ్యాసాపురంలో వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీరు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని సర్పంచు సీతారాములు కోరుతున్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం

బొమ్మనహాళ్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దరాంపురంలో గ్రామదేవత దేవమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ పూజలను సోమవారం ప్రారంభించారు. గంగజలం తెచ్చి పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న ఆ గ్రామస్థులు తెలిపారు.



హోమం నిర్వహిస్తున్న పురోహితులు

మూతపడ్డ వైద్యశాల



యాడికి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ యునాని వైద్యశాల వైద్యుడు ఏడాది క్రితం బదిలీ అయ్యాడు. ఆ స్థానంలో మరొకరిని నియమించలేదు. దీంతో కాంపౌండరే ఆ వైద్యశాల నిర్వహించేవాడు. రెండు నెలల క్రితం అతను రిటైర్డ్ అయ్యాడు. దీంతో నాటి నుంచి ఆ వైద్యశాల మూతపడింది. చికిత్స కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వైద్యశాలకు డాక్టర్‌ను, కాంపౌండర్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా ముచ్చర్లపల్లి



శెట్టూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుకూరు గ్రామ పంచాయతీ ముచ్చర్లపల్లి అపరిశుభ్రంగా మారింది. కొన్ని చోట్ల మురుగుకాలువలు లేకపోవడం.. ఉన్న కాలువల్లో పూడిపోవడంతో మురుగు వీధుల్లోనే ప్రవహిస్తోంది. వర్షాలు కురుస్తుండటంతో వీధులన్నీ పూర్తిగా అపరిశుభ్రంగా మారాయి. సమస్యను పరిష్కరించేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇళ్లలోకి వర్షపు నీరు

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే కారణం



కాలనీలో చేరిన వర్షం నీరు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని11వ వార్డు తిలక్‌నగర్‌లోని మదీన మసీదు దగ్గర కాలువ నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో.. కాలనీలోని ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది. ఆరు నెలల క్రితం కాలువల నిర్మాణం కోసం గుంతలు వదిలేశారు. మురుగు నిల్వ ఉండటంతో దోమలు విపరింగా పెరిగి రోగాల బారిన పడుతున్నామని, కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆ కాలనీ వాసులు రెండు వారాల క్రితం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా కూడా చేశారు. అయినా ఆ అధికారులు పట్టించుకోలేదు. సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి కాలనీలోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు మోటర్ల ద్వారా నీటిని కాలువలోకి వదిలారు.

కరాటేలో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

తాడిపత్రి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో ఆదివారం నిర్వహించిన అండర్-11, అండర్-14 విభాగం కరాటే పోటీలో తాడిపత్రికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో దాదాపు 800 మంది విద్యార్థులు పాల్గొనగా.. అందులో పట్టణానికి చెందిన 26 మంది ఉన్నారు. వీరు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు.

రహదారి ఏర్పాటుకు స్థల పరిశీలన

కణేకల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వేదావతి హగరిలో రూ. ఆరు కోట్లతో రహదారి ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆ పార్టీ మండల కన్వీనర్ లాలెప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, కురుబ నాగరాజు రహదారి స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే ఈపనులు ప్రారంభమవుతాయన్నారు.

మెరుగైన వైద్య సేవల కోసం ధర్నా

గుత్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. అధికారులు స్పందించి స్థానిక ఆసుపత్రిలోనే ప్రజలకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, నాయకులు రేణుకా, అశోక్, మల్లికార్జున పాల్గొన్నారు.

కౌన్సిల్‌ను రద్దు చేయండి

గుంతకల్లుటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వార్డులలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనులు చేపట్టాలని, లేకుంటే కౌన్సిల్‌ను రద్దు చేయాలని టీడీపీ కౌన్సిలర్లు భాస్కర్, కృపాకర్, నాగరత్న డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సాధారణ సమావేశంలో వారు మాట్లాడారు. వార్డులో పెండింగ్‌లో ఉన్న పనులను వచ్చే నెలలోపు చేయకపోతే కౌన్సిల్‌లో నిరసన వ్యక్తం చేస్తామన్నారు. అభివృద్ధి పనులు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ కౌన్సిలర్ సుధాకర్ అజెండా పత్రాలను చింపి వేసి బయటకు వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్ భవాని, కమిషనర్ నయీమ్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శిపై ఫిర్యాదు

బెళుగుప్ప, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడి గ్రామ సర్పంచ్ ప్రకాష్‌రెడ్డి, సెక్రెటరీ వి శంకర్ ఉపాధి నిధులు కాజేశారని ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్ జిల్లా ఉన్నతాధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఇంకుడు గుంతలు తవ్వగా ప్రభుత్వం రూ.77 వేల బిల్లులు మంజూరు చేసిందని, తమకు డబ్బు ఇవ్వకుండా బ్యాంకు ఖాతాలో డబ్బు లేకున్నా బౌన్స్ చెక్కు ఇచ్చి మోసం చేశారని ఆధారాలతో ఫిర్యాదు చేశారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

ఏఐటీయూసీలో చేరిక

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీలో కళ్యాణదుర్గం మున్సిపల్ ఇంజనీరింగ్ డెయిలీ వేజ్ కార్మికులు చేరినట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 32మంది ఇంజనీరింగ్ కార్మికులు, 18 మంది డెయిలీ వేజ్ కార్మికులు చేరినట్లు తెలిపారు.

క్రైం న్యూస్..

వ్యక్తికి గాయాలు

గుత్తిరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. యర్రగుడిలో భాస్కర్‌పై అదే గ్రామానికి చెందిన క్రిష్టప్ప, సాలప్ప, సుబ్బన్న, వాసు సోమవారం కర్రలతో దాడి చేశారు. గాయపడ్డ భాస్కర్‌ను స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

దుకాణంలో చోరీ

ఉరవకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠం ఆవరణంలో ఉన్న కేజీఎన్ ఇంజనీరింగ్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు రూ.2.50 లక్షల విలువ చేసే బేరింగ్‌లు, మోటార్లు ఎత్తుకెళ్లారు. ఆ షాపు యజమాని జిలాన్ బాషా ఆదివారం షాపునకు తాళాలు వేసి ఇంటికి వెళ్లి పోయాడు. దుండగులు షాపు షెట్టర్ తాళాలు పగుల గొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు.

బస్టాండ్‌లో..

గుత్తి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన అనిత బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న సమయంలో ఆమె బ్యాగ్ చోరీకి గురైంది. అందులో రూ.5వేలు, నాలుగు లక్షల విలువైన చెక్కులు, జ్యూలరీ బాండ్లు ఉన్నాయని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యక్తిపై దాడి

పెద్దపప్పూరు, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జూటూరు గ్రామంలో రామసుబ్బారెడ్డిపై అదే గ్రామానికి చెందిన బైరెడ్డి రవికుమార్‌రెడ్డి సోమవారం కట్టెతో దాడి చేశాడు. దీంతో గాయపడిన రామసుబ్బారెడ్డిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెద్దపప్పూరు పోలీసులు బైరెడ్డి రవికుమార్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేస్తామన్నారు.

అరటిలోడు లారీ బోల్తా

పుట్లూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు గ్రామశివారులో సోమవారం రాత్రి అరటికాయల లోడుతో వెళుతున్న లారీ బోల్తాపడింది. ఈ లారీ కడవకల్లు నుంచి ఢిల్లీకి వెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అరటి కాయలు దెబ్బతినగా.. కూలీలు , డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని పోలీసులు తెలిపారు.

నిబంధనల మేరకే ఆక్రమణల తొలగింపు

మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్



కళ్యాణదుర్గం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నియమ నిబంధనల మేరకే కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు, ఆక్రమణ తొలగింపు చేస్తున్నామని, దీనికి అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషన్ వంశీకృష్ణ భార్గవ్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తమ ఆసుపత్రికి ఎదురుగా ఆక్రమణలతో ఇబ్బందులు పడుతున్నామని ఆర్డీటీ ఆసుపత్రి యాజమాన్యం, ఆక్రమణతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని పట్టణ సీఐకి, అదే విధంగా ఆర్డీఓకు ఎమ్మార్పీఎస్ నాయకులు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఆర్అండ్‌బీ స్థలాల్లో అక్రమణలను తొలగించామని స్పష్టం చేశారు. అలాగే కంబదూరు రోడ్డు నుంచి మడకశిర వరకు రోడ్డు మంజూరైందని, ఆ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలపై ఒక నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరామన్నారు. జూలై 18న మండల సర్వేయర్ ఆధ్వర్యంలో నాలుగు రోడ్లను పూర్తిగా సర్వే చేసి, ఆర్అండ్‌బీ స్థలాలు ఎవ్వరైతే ఆక్రమించారో పూర్తి వివరాలు అందచేశారన్నారు. అయితే మరోసారి సర్వే చేయాలని జిల్లా సర్వేయర్‌కు కూడా వినతిపత్రం అందచేశామని, అక్టోబరు 13న సర్వే చేసి తమకు పూర్తిస్థాయిలో ఒక నివేదిక అందచేశారన్నారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు ముందుకు వెళ్తున్నామన్నారు. పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కుంటగుట్ట తవ్వకాన్ని అడ్డుకున్న అధికారులు

కుందుర్పి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని గుర్రాలకుంట గట్టును కొందరు రైతులు సోమవారం చదును చేయడానికి యత్నించగా.. అధికారులు అడ్డుకున్నారు. సర్వే నెంబర్ 251లోని 12.50 ఎకరాలు, సర్వే నెంబర్ 250లోని 8.20 ఎకరాలు రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు జారీ అయ్యాయి. అయితే ఈ సర్వే నెంబర్ల మధ్యలో గుర్రాలకుంట ఉంది. ఆ కుంట గట్టుపై నుంచి పొలాలకు, కదరంపల్లి గ్రామానికి వెళ్లేందుకు దారి ఉంది. సోమవారం ఆ గట్టును కొందరు రైతులు చదును చేసుకునేందుకు యత్నిస్తుండగా.. కదరంపల్లి వాసులు రెవెన్యూ అధికారులకు సమాచారాన్ని అందించారు. తహసీల్దార్ ఓబుళేసు వీఆర్వోను, సర్వేలను పంపి ఆ పనులను అడ్డుకున్నారు.

అర్హులందరికీ ఇళ్లు

బెళుగుప్ప, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అర్హులకు ప్రభుత్వం ఇళ్ల మంజూరు చేస్తోందని, నవంబరు ఐదో తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ సచివాలయ సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవాస్ ప్లస్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇళ్లు మంజూరు చేస్తున్నాయని, దీనిపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ గోపిచంద్ నాయక్, ఎంపీపీ పెద్దన్న, టీడీపీ నాయకులు పెద్దతిప్పయ్య, మల్లికార్జున, రాధాకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.